సంపుటి : 9
సంచిక : 279
గురువారం
02 జూలై 2026
పేజీలు : 12
వెల : 2/-
E-PAPER

# విశ్వవాయిస్

10 YEARS CELEBRATING

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY.

SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT

CERCULATED AT : • WEST GODAVARI • VISAKHAPATNAM • SRIKAKULAM • VIJAYANAGARAM • VIJAYAWADA • HYDERABAD • BANGLORE • CHENNAI, • DELHI • MUMBAI • TIRUPATHI • ANANTAPUR • GUNTUR • KADAPA • KHAMMAM • KARIMNAGAR • KURNOOL • NELLORE • NIZAMABAD • ONGOLE






Contact For Ads:
7579339999


# చట్టసభల చట్టానికి.. అధికారుల తూట్లు!




- 'యాక్ట్ 30' నిబంధనలను బేఖాతరు చేస్తున్న ఉన్నత విద్యాశాఖ కమిషనరేట్?
- ఆర్థిక శాఖ ఉత్తర్వులను పక్కనబెట్టి సమాంతర నియామకాలపై కాంట్రాక్ట్ అధ్యాపకుల ఆందోళన
- 27 ఏళ్ల సర్వీసుకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆరోపణలు
- ముఖ్యమంత్రి, ఉన్నత విద్యాశాఖ మంత్రి తక్షణమే జోక్యం చేసుకోవాలని డిమాండ్


విజయవాడ లో ఉన్నత విద్యాశాఖ అధికారులతో ఉద్యోగుల ప్రతినిధులు భేటీ


▲ ఉద్యోగుల ప్రతినిధులతో కలిసిన మంత్రి వక్కపల్ల

**కాకినాడ, విశ్వం వాయిస్ ప్రత్యేక ప్రతినిధి :** రాష్ట్రంలో చట్టసభలు ఆమోదించిన చట్టాలను, ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను అమలు చేయాల్సిన బాధ్యత గల ఉన్నతాధికారులే వాటిని విస్మరిస్తే ఇక సామాన్యులకు న్యాయం ఎక్కడ దొరుకుతుంది? ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో గత 27 సంవత్సరాలుగా విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దుతున్న ఒప్పంద (కాంట్రాక్ట్) అధ్యాపకుల విషయంలో కాలేజీయేట్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఉన్నతాధికారులు వ్యవహరిస్తున్న తీరు సరిగ్గా ఇలాగే ఉందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చట్టబద్ధంగా రావాల్సిన రెగ్యులరైజేషన్ హక్కును కాలరాస్తూ అధికారులు తీసుకుంటున్న ఏకపక్ష నిర్ణయాల వల్ల రాష్ట్రవ్యాప్తంగా 684 మంది అధ్యాపకుల కుటుంబాలు వీధిన పడే పరిస్థితి ఏర్పడింది. చట్టం ఏం చెబుతోంది?.. అధికారులు ఏం చేస్తున్నారు? రాష్ట్రవ్యాప్తంగా సుదీర్ఘ కాలంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో సేవలు అందిస్తున్న ఒప్పంద అధ్యాపకులను క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం 'యాక్ట్ 30' మరియు జీవో నెం. 114 జారీ చేసింది. ఈ చట్టంలోని పాయింట్ నంబర్ 5 ప్రకారం... ఒప్పంద అధ్యాపకుల రెగ్యులరైజేషన్ ప్రక్రియ తుది దశకు చేరి పూర్తి అయ్యే వరకు సదరు పోస్టులలో మిగతా .. 2లో..

27 ఏళ్ల సేవ – అనుభవం | చట్టబద్ధ హక్కు – 'యాక్ట్ 30' | న్యాయం కావాలి – సమాంతర నియామకాలు నిలిపివేయాలి

ఆధారాలు లేని

# ఆరోపణలు సహించం

- సోషల్ మీడియా దుర్వినియోగంపై పవన్ హెచ్చరిక!
- వాక్ స్వాతంత్ర్యాన్ని దుర్వినియోగం చేయొద్దని పవన్ హెచ్చరిక
- ఆధారాలు లేని ఆరోపణలు, వ్యక్తిగత దూషణలు సహించబోమని స్పష్టం
- సైబర్ వేధింపుల బాధితుల కోసం ప్రత్యేక విభాగం ఏర్పాటు
- ఆధారాలతో ఫిర్యాదు చేస్తే బీఎన్ఎస్ చట్టాల ప్రకారం కఠిన చర్యలు



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** సోషల్ మీడియా దుర్వినియోగంపై ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. వాక్ స్వాతంత్ర్యాన్ని దుర్వినియోగం చేయడం సరికాదన్నారు. ఒకరి హక్కులను మరొకరు హరిస్తే చట్ట పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కును స్వాగతిస్తామని, కానీ ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం సహించబోమని స్పష్టం చేశారు. మత విశ్వాసాలను దెబ్బతీయడం రాజ్యాంగం కల్పించిన హక్కు కాదని పవన్ అన్నారు. వ్యక్తిగత దూషణలు, చంపేస్తామని బెదిరించడం, దేవుళ్లు, దేవతలపై ఉద్దేశపూర్వక వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదన్నారు. నిర్మాణాత్మక విమర్శలను ప్రభుత్వం ఎప్పుడూ స్వాగతిస్తుందని చెప్పారు. సైబర్ వేధింపులు, పరువు ప్రతిష్ఠలను దెబ్బతీసే చర్యలు ఆందోళన కలిగిస్తున్నాయని పవన్ పేర్కొన్నారు. నేరస్థులకు కులం, మతం ఉండదని స్పష్టం చేశారు. సోషల్ మీడియా వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. డిప్యూటీ సీఎం కార్యాలయంలో ఇందుకోసం ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. బాధితులు ఆధారాలతో ఫిర్యాదు చేస్తే వెంటనే విచారణ చేపట్టి కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇలాంటి నేరాలకు పాల్పడిన వారిపై బీఎన్ఎస్ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

భారత్ విశ్వసనీయ

# మిత్ర దేశం

అమెరికా సెనెటర్



**విశ్వం వాయిస్ న్యూస్ :** అమెరికాకు భారత్ విశ్వసనీయ మిత్రదేశమని అమెరికా సెనెటర్ స్టీవ్ డైన్స్ ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. ఇరుదేశాల మధ్య ఉన్న మధ్య సంబంధాలు రెండు దేశాలకే కాకుండా ప్రపంచదేశాలకు కూడా మిగతా .. 2లో..

రాష్ట్రాభివృద్ధి, తెలుగువారిని

# అందలం ఎక్కించటమే కూటమి లక్ష్యం

- పొదుపులో మన డ్వాక్రా మహిళలు దేశానికే ఆదర్శం
- నేరస్థులకు వంతపాడే రాజకీయ పార్టీలు మనకెందుకు వ్యాఖ్య
- సైకో సహకారంతోనే గొడ్డలి పార్టీ నేతల మాటలు, చేతలు అని ఆగ్రహం
- మావిగన్ అన్న వ్యక్తులు రాజధానికి రౌడీల్లా దండయాత్రలు చేస్తున్నారు
- నెల్లూరు జిల్లా పున్నపువారిపల్లెలో పేదల సేవలో కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు

**పున్నపువారిపల్లె, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రాభివృద్ధితో పాటు తెలుగువారిని ఉన్నత శిఖరాలకు చేర్చడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రజాభీష్టానికి అనుగుణంగానే సుపరిపాలన అందిస్తున్నామని, ప్రజల జీవితాల్లో శాశ్వత వెలుగులు నింపేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని ఆయన వివరించారు. నెల్లూరు జిల్లా గూడూరు నియోజకవర్గం పున్నపువారిపాలెంలో బుధవారం జరిగిన 'పేదల సేవలో' కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రజా వేదిక సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ "ప్రజలు చూపిస్తున్న అమితమైన అభిమానం చూస్తుంటే, పడుతున్న కష్టమంతా మర్చిపోతున్నాం. గత పాలకులు నెల్లూరు జిల్లాను అత్యంత అశాస్త్రీయంగా విభజించారు. గూడూరును తిరిగి నెల్లూరు జిల్లాలో కలుపుతామని ఇచ్చిన హామీని మేము నెరవేర్చాం. సైదాపురం, కలువాయి మండలాలను కూడా తిరిగి నెల్లూరు జిల్లాలోనే విలీనం చేశాం. పరిపాలన అనేది ప్రజల అభీష్టం మేరకే సాగాలి తప్ప, పెత్తందారీ పోకడలకు ఇక్కడ తావులేదు. అందుకే రాష్ట్రవ్యాప్తంగా అశాస్త్రీయంగా జరిగిన జిల్లాల విభజనను సవరించాం. ప్రజల జీవితాల్లో సుస్థిరమైన మార్పు తీసుకురావాలన్నదే మా ధ్యేయం. సామాజిక బాధ్యతగా ప్రతి నెలా ఒకటో తేదీన నిరుపేదలకు, ఆపన్నులకు పెన్షన్ అందిస్తున్నాం. వృద్ధాప్య, వితంతు, దివ్యాంగులతో పాటు మొత్తం 28 కేటగిరీల లబ్ధిదారులకు మిగతా .. 2లో..



వచ్చే ఎన్నికలు

# 'మావిగన్ / అమరావతి' చూసుకుందాం

'సర్' పేరుతో పెద్ద కుట్ర జరుగుతోంది
వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్



**తాడేపల్లి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఏపీ రాజధాని అమరావతిని వైసీపీ అధినేత జగన్ మరోసారి తిరస్కరిస్తూ సంచలన వ్యాఖ్యలు చేశారు. తాము మావిగన్‌కే కట్టుబడి ఉన్నామని... వచ్చే ఎన్నికలు మావిగన్ వర్సెస్ అమరావతి అని ఆయన అన్నారు. మావిగన్ ప్రతిపాదనకు తాము కట్టుబడి ఉన్నామని తెలిపారు. మావిగన్ కు మద్దతు ఇచ్చేవారంతా వైసీపీకి ఓటు వేస్తారని చెప్పారు. ఈ రెండు రాజధానుల్లో ప్రజల మద్దతు దేనికి ఎక్కువగా ఉందో వచ్చే ఎన్నికల్లో తేలిపోతుందని అన్నారు. తాడేపల్లిలో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

**'సర్' పేరుతో పెద్ద కుట్ర జరుగుతోంది**

"ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (సర్) పేరుతో రాష్ట్రంలో పెద్ద కుట్ర జరుగుతోంది. స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం పేదవాడి ఓటు హక్కునే కాలరాస్తున్నారు" అంటూ వైసీపీ అధినేత జగన్ కూటమి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తాడేపల్లిలో నిర్వహించిన మీడియా సమావేశంలో మిగతా .. 2లో..

పాక్‌లో చారిత్రక

# గురుద్వారా ధ్వంసం

తీవ్రంగా ఖండించిన భారత్



**విశ్వం వాయిస్ న్యూస్ :** పాకిస్థాన్‌లో ఉన్న వందేళ్లకుపైగా చరిత్ర కలిగిన ఓ గురుద్వారాను కూల్చేందుకు ప్రయత్నించిన ఘటనను భారత్ తీవ్రంగా ఖండించింది. దీన్ని అత్యంత హేయమైన చర్యగా పేర్కొంది. ఈ దుశ్చర్యకు పాల్పడిన వారిని న్యాయస్థానం ముందు నిలబెట్టాలని.. మిగతా .. 2లో..

# శెహభాష్.. లోకేశ్

విద్యా శాఖ మంత్రిగా లోకేశ్ పనితీరుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రశంసలు



**విశాఖపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పనితీరుపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రశంసలు కురిపించారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న విద్యా సంస్కరణలు అద్భుతంగా ఉన్నాయని, వాటిని భవిష్యత్తులోనూ కొనసాగించాలని సూచించారు. అనంతపురంలోని ఏపీ సెంట్రల్ యూనివర్సిటీ తొలి స్నాతకోత్సవంలో పాల్గొన్న అనంతరం ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. కార్యక్రమం ముగిశాక, రాష్ట్రపతికి వీడ్కోలు పలికేందుకు మంత్రి లోకేశ్ హెలికాప్టర్ వద్దకు వెళ్లారు. ఈ సందర్భంగా లోకేశ్‌ను తన వద్దకు పిలిచిన రాష్ట్రపతి, విద్యా వ్యవస్థలో తీసుకొస్తున్న మార్పులను మిగతా .. 2లో..

జగన్.. అసలు మీ మాట మీద

# మీకు నమ్మకముందా?

ఏపీ మంత్రి కందుల దుర్గేష్



**నిడదవోలు, విశ్వం వాయిస్ న్యూస్ :** అధికారంలో ఉన్నప్పుడు మూడు రాజధానుల పేరిట మూడుముక్కలాట ఆడిన జగన్.. ఇప్పుడు 'మావిగన్' పేరిట కొత్త నాటకానికి తెరలేపడం హాస్యాస్పదమని ఏపీ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. రాజధాని మార్పు, 2029 ఎన్నికలపై మిగతా .. 2లో..




రేవంత్.. చర్చకు నేను రెడీ..

# డేట్, టైమ్ ఫిక్స్ చేయండి : కేటీఆర్ సవాల్



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** కాంగ్రెస్‌కు ఇచ్చిన అవకాశంలో 50 శాతం పూర్తయిందని.. ఇప్పటివరకు ఏం చేశారో ఆ పార్టీ చెప్పుకోలేకపోతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. కేసీఆర్ అధికారం నుంచి దిగిపోయేనాటికి రూ. 3.50లక్షల కోట్ల అప్పు మాత్రమే ఉందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. అప్పుల కారణంగా మిగతా .. 2లో..

ఆదాయ సమీకరణపై అధికారులు

# సీరియస్‌గా దృష్టిసారించాలి : సీఎం రేవంత్



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర బడ్జెట్‌కు అనుగుణంగా లక్ష్యాలు సాధించాలంటే ఆదాయ సమీకరణపై అధికారులు సీరియస్‌గా దృష్టి సారించాలని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. వివిధ శాఖలు సామర్థ్యాలను మెరుగుపరుచుకోవాలన్నారు. ఆదాయ సమీకరణపై అధికారులకు సీఎం కీలక ఆదేశాలు జారీ చేశారు. "హెచ్ఎండీఏ, టీజీఐఐసీ ఆదాయ సమీకరణపై మిగతా .. 2లో..

# ఎడిటర్ వాయిస్

## వ్యవసాయం బలపడితేనే దేశం సుభిక్షం

భారతదేశాన్ని వ్యవసాయ ప్రధాన దేశంగా ప్రపంచం గుర్తిస్తుంది. రైతు కష్టంతో పండే ప్రతి గింజ దేశ ఆహార భద్రతకు పునాది. రైతు చెమటతోనే కోట్లాది ప్రజల కడుపు నిండుతోంది. అయినప్పటికీ, దేశానికి అన్నం పెట్టే రైతు జీవితం నేటికీ ఎన్నో సవాళ్ల మధ్య కొనసాగుతోంది.

ప్రకృతి వైపరీత్యాలు, అసమయ వర్షాలు, కరువు, వరదలు, వాతావరణ మార్పులు రైతును తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి. మరోవైపు విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, డీజిల్, విద్యుత్ ఖర్చులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. కానీ పంటకు తగిన గిట్టుబాటు ధర మాత్రం రైతుకు అందడం లేదు. ఫలితంగా రైతు అప్పుల ఊబిలో చిక్కుకుని ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు.

వ్యవసాయం కేవలం ఒక వృత్తి కాదు... అది దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక. రైతు బాగుంటే గ్రామం బాగుంటుంది. గ్రామం బాగుంటే దేశం అభివృద్ధి చెందుతుంది. అందుకే రైతు సంక్షేమాన్ని ప్రభుత్వాలు అత్యున్నత ప్రాధాన్యంగా చూడాలి.

సాగునీటి ప్రాజెక్టులు సమయానికి పూర్తవ్వాలి. ప్రతి రైతుకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండాలి. పంటలకు కనీస మద్దతు ధర సమర్థవంతంగా అమలు కావాలి. పంట బీమా, నిల్వ గిడ్డంగులు, మార్కెటింగ్ సదుపాయాలు మరింత బలోపేతం చేయాలి. రైతు పండించిన పంటకు న్యాయమైన ధర లభించినప్పుడే వ్యవసాయం లాభసాటిగా మారుతుంది.

నేటి యువత కూడా వ్యవసాయాన్ని ఒక ఆధునిక వృత్తిగా చూడాల్సిన అవసరం ఉంది. డ్రోన్ టెక్నాలజీ, కృత్రిమ మేధస్సు, ఖచ్చితమైన సాగు పద్ధతులు, సేంద్రియ వ్యవసాయం, విలువ ఆధారిత వ్యవసాయ ఉత్పత్తులు వంటి కొత్త అవకాశాలను రైతులు అందిపుచ్చుకోవాలి. సాంకేతికతతో కూడిన వ్యవసాయం రైతు ఆదాయాన్ని పెంచే మార్గం.

వ్యవసాయం బలపడాలంటే ప్రభుత్వం, శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు, రైతు సంఘాలు, ప్రజలు కలిసి పనిచేయాలి. రైతు సమస్యలను ఎన్నికల హామీలకే పరిమితం చేయకుండా, శాశ్వత పరిష్కారాల దిశగా అడుగులు వేయాలి.



రైతు కష్టానికి తగిన గౌరవం, పంటకు తగిన ధర, వ్యవసాయానికి తగిన ప్రాధాన్యం లభించిన రోజే నిజమైన అభివృద్ధి ప్రారంభమవుతుంది.

"రైతు బలపడితేనే... దేశం సుభిక్షంగా నిలుస్తుంది."

ఎడిటర్ : కె.సునీల్‌కుమార్

# క్రైం వాయిస్

## ఆగివున్న లారీని ఢీకొన్న మరో లారీ..

### నలుగురు సజీవ దహనం



**బోయపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** పల్నాడు జిల్లా బోయపాలెం వద్ద జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. రెండు లారీలు ఢీకొని మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో నలుగురు సజీవ దహనమయ్యారు. ఆగివున్న లారీని వెనుక నుంచి మరో లారీ ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఇద్దరు డ్రైవర్లు, ఇద్దరు క్లీనర్లు మంటల్లో చిక్కుకుని అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలను ఆర్పివేశారు.

భార్య, కుమార్తెను చంపిన రియల్టర్..

## ఆపై లారీ కింద పడి ఆత్మహత్య



**చెన్నై (సైదాపేట), విశ్వం వాయిస్ న్యూస్ :** భార్య, కుమార్తెను చంపి ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి ఆత్మహత్య చేసుకున్న ఉదంతమిది. తమిళనాడులో జరిగిన ఈ ఘటనపై పోలీసుల కథనం ప్రకారం.. ధర్మపురి జిల్లా కోట్టైకోవిల్ ప్రాంతానికి చెందిన డీఎంకే నేత సంతోష్(45) రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు. ఆయనకు భార్య శరణ్య(36), కుమార్తె సాత్విక(14) ఉన్నారు. బాలిక 9వ తరగతి చదువుతోంది. మంగళవారం బడికి వెళ్లిన బాలికను పాఠశాల ముగియకముందే సంతోష్ ఇంటికి తీసుకొచ్చారు. ఇంట్లో భార్యను గొంతు నులిమి, కుమార్తె తలపై సుత్తితో కొట్టి హత్య చేసిన సంతోష్.. ద్విచక్ర వాహనంపై బయటకు వెళ్లాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టానికి తరలించారు. ఈలోగా సేలం-ధర్మపురి హైవేలో ఓ వ్యక్తి లారీ కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. అక్కడకు వెళ్లి పరిశీలించిన పోలీసులు మృతుడిని సంతోష్‌గా నిర్ధారించారు. వ్యాపారంలో నష్టం రావడంతో భార్య, కూతుర్ని చంపి, సంతోష్ ఆత్మహత్యకు పాల్పడ్డాడా లేక మరేదైనా కారణముందా అని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## మద్యం మత్తులో గొడవ పడుతున్నాడని కుమారుడికి నిప్పంటించిన తండ్రి

**చెన్నై(గిండి), విశ్వం వాయిస్ న్యూస్ :** మద్యం మత్తులో కుటుంబ సభ్యులతో గొడవ పడుతున్నాడని కుమారుడిపై థిన్నర్ పోసి తండ్రి నిప్పంటించాడు. ఈ ఘటన తమిళనాడులో చోటుచేసుకుంది. తూత్తుకుడి మడత్తూర్ అమ్మన్ కోవిల్‌వీధికి అరుల్‌రాజ్(32) గతంలో మద్యానికి బానిసై వ్యసన విముక్తి కేంద్రంలో చికిత్స పొంది తిరిగొచ్చాడు. కొద్దిరోజులు మద్యం జోలికి వెళ్లలేదు. ఇటీవల మళ్లీ మద్యానికి బానిసయ్యాడు. మంగళవారం రాత్రి తాగి ఇంటికొచ్చిన అరుల్‌రాజ్ తల్లిపై దాడిచేయగా ఆమెకు గాయాలయ్యాయి. బిడ్డ ఆరోగ్యం సరిగాలేదని అతని సోదరి పుట్టింటికి రాగా ఆమెనూ బెదిరించాడు. తండ్రి దళముత్తు మందలించడంతో అతనిపైనా దాడి చేశాడు. అదే రోజు రాత్రి ఇంటి పక్కన నిద్రిస్తున్న అరుల్‌రాజ్‌పై అతని తండ్రి ఇంట్లో పనికోసం తెచ్చిన థిన్నర్ పోసి నిప్పంటించాడు. అరుల్‌రాజ్ అక్కడికక్కడే చనిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని దళముత్తును అరెస్టు చేసి విచారణ కొనసాగిస్తున్నారు.

## స్కూలు బస్సుపై కూలిన రావిచెట్టు.. ముంబయిలో విద్యార్థి మృతి



**ముంబయి, విశ్వం వాయిస్ న్యూస్ :** విద్యార్థుల్ని ఇళ్లకు తీసుకువెళున్న పాఠశాల బస్సుపై రావిచెట్టు కూలడంతో ఒకరు ప్రాణాలు కోల్పోగా ఐదుగురు గాయపడ్డారు. మంగళవారం ముంబయిలోని చెంబురులో ఈ ఘటన చోటు చేసుకుంది. ఆ సమయంలో బస్సులో 13 మంది ఉన్నారు. దానిలో చిక్కుకుపోయినవారిని సహాయక బలగాలు రక్షించాయి. ఆసుపత్రిలో ఒకరు ప్రాణాలు కోల్పోగా మిగిలినవారికి చికిత్స అందిస్తున్నారు. ఘటనపై సమగ్ర విచారణకు ముంబయి మేయర్ ఆదేశించారు. చెట్టు కూలడానికి ఎవరి నిర్లక్ష్యమైనా కారణమని తేలితే కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

## ఒకరికి బదులు పరీక్ష రాసిన మరొకరు : ఇద్దరికీ మూడేళ్ల జైలు

**కొత్తగూడెం, విశ్వం వాయిస్ న్యూస్ :** పదో తరగతి పరీక్షల్లో ఒకరికి బదులు మరో విద్యార్థి పరీక్ష రాసిన కేసులో ఇద్దరికీ మూడేళ్ల జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ.5,000 జరిమానా విధిస్తూ కొత్తగూడెం ఒకటో అదనపు జ్యుడీషియల్ మొదటి శ్రేణి న్యాయమూర్తి కె.సాయిశ్రీ మంగళవారం తీర్పునిచ్చారు. 2019 నవంబరు 4న జరిగిన సప్లిమెంటరీ పదోతరగతి సోషల్‌స్టడీస్ పరీక్షను కొత్తగూడెం లిటిల్‌బడ్స్ పాఠశాల పరీక్ష కేంద్రంలో అసలు విద్యార్థి తెల్లం అనిల్ స్థానంలో పూనెం సందీప్ పరీక్ష రాస్తున్నట్లు స్క్వాడ్ అధికారులు గుర్తించారు. వారి సూచనల మేరకు ఇన్విజిలేటర్ కె.శ్రీనివాస్ వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ విద్యార్థుల వివరాలను పోలీసులు విచారించగా అసలు విద్యార్థి టి.అనిల్ టేకులపల్లి మండలం కోయగూడెం, అదే గ్రామానికి చెందిన నకిలీ విద్యార్థి సందీప్‌గా తేలింది. వారిద్దరిపై కేసు నమోదు చేసి కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశారు. విచారణ సందర్భంగా న్యాయమూర్తి ఐదుగురు సాక్షులను విచారించి ఇద్దరిపై నేరం రుజువైనందున పైవిధంగా తీర్పునిచ్చారు.

## ఉగాండాలో వివాహిత ఆత్మహత్య



**హోసపెటే, విశ్వం వాయిస్ న్యూస్ :** కర్ణాటకకు చెందిన వివాహిత ఉగాండాలో ఆత్మహత్య చేసుకున్నారు. ఈ మేరకు విజయనగర జిల్లా కొట్టూరు పోలీసులు వెల్లడించారు. కొట్టూరు తాలూకా కన్నాయకనకట్టెకి చెందిన బిందు (24) భర్త ఉగాండాలోని ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నారు. ఇటీవల భర్త వద్దకు ఆమె వెళ్లారు. ఈ క్రమంలో బిందు ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబసభ్యులకు సమాచారం అందింది. అయితే ఆమె మృతికి గల కారణాలు తెలియరాలేదు. దీనిపై వివరాలు సేకరిస్తున్నామని కొట్టూరు పోలీసులు తెలిపారు. ఉగాండా నుంచి మృతదేహం గురువారం స్వస్థలానికి రానుందని కుటుంబ సభ్యులు తెలిపారు.

## హైవేపై బొలెరో బీభత్సం..

### బైక్‌ను ఢీకొన్న వాహనం

**వెదుళ్లపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం వెదుళ్లపాలెం సమీపంలో జాతీయ రహదారిపై బొలెరో వాహనం బీభత్సం సృష్టించింది. వేగంగా వచ్చి ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో లచ్చుబాబు అనే వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. ఘటనకు సంబంధించిన దృశ్యాలు సీసీకెమెరాల్లో రికార్డయ్యాయి.

## 'పుష్ప' తరహాలో గంజాయి స్మగ్లింగ్

### రూ.2.6 కోట్ల విలువైన 525 కిలోల స్వాధీనం



**కొత్తగూడెం, విశ్వం వాయిస్ న్యూస్ :** భద్రాద్రి జిల్లా బూర్గంపాడు మండలం సారపాకలో మంగళవారం తెలంగాణ ఈగల్ ఫోర్స్, భద్రాద్రి జిల్లా పోలీసులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించి కంటైనర్ వాహనంలో తరలిస్తున్న రూ.2.6 కోట్ల విలువైన 525 కిలోల గంజాయిని పట్టుకున్నారు. ఈగల్ ఫోర్స్ అధికారులు వివరాల ప్రకారం..ఒడిశాకు చెందిన ప్రధాన నిందితుడు సహదేవ్ హంటల్ ఆ రాష్ట్రంలోని అల్లూరికోట అటవీ ప్రాంతంలో గంజాయిని సేకరించాడు. దానిని కూలీల సాయంతో ఏపీలోని తులసిపాకకు తరలించాడు. అక్కడి నుంచి పుష్ప సినిమాను తలపించేలా ప్రత్యేక అరలు ఏర్పాటు చేసిన కంటెయినర్‌లో ఉత్తర్‌ప్రదేశ్‌కు తరలించేందుకు ఏర్పాటు చేశాడు. భద్రాచలం, ఖమ్మం, వరంగల్, ఆదిలాబాద్ మీదుగా తరలించేలా ప్రణాళిక రచించాడు. విశ్వసనీయ సమాచారం మేరకు స్థానిక పోలీసుల సాయంతో ఈగల్‌ఫోర్స్ అధికారులు సారపాకకు చేరుకోగానే కంటెయినర్‌ను అడ్డుకున్నారు. కంటెయినర్‌తోపాటు ఎస్కార్ట్‌గా వస్తున్న ద్విచక్రవాహనం, ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడు సహదేవ్ హంటల్, ఏపీలోని మారేడుమిల్లికి చెందిన డోగ్రి త్రినాథ్, యూపీకి చెందిన లారీ డ్రైవర్ కుల్‌దీప్ శర్మలతోపాటు ఓ బాలుడిని అదుపులోకి తీసుకున్నారు. పరారీలో ఉన్నవారి కోసం గాలింపు చేపట్టామని తెలిపారు.

## 37 కేజీల బంగారంతో పట్టుబడ్డ వ్యక్తి



**గువాహటి, విశ్వం వాయిస్ న్యూస్ :** అంతర్జాతీయంగా బంగారాన్ని అక్రమంగా రవాణా చేస్తున్నట్లు అనుమానిస్తున్న ఒక ముఠాను గువాహటి పోలీసులు ఛేదించారు. దాదాపు రూ.54 కోట్లు విలువ చేసే 37 కేజీల బంగారంతో ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ఇంత పెద్దమొత్తంలో అక్రమ బంగారాన్ని పట్టుకోవడం ఇదే మొదటిసారి అని మంగళవారం పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు. దేశంలోని వివిధ నగరాల నుంచి మధ్య ఆసియా, మయన్మార్‌లకు ఈ నెట్‌వర్క్‌తో సంబంధాలు కొనసాగుతున్నట్లు వెల్లడైందని, తదుపరి దర్యాప్తు కొనసాగుతోందని ప్రకటనలో పేర్కొన్నారు. జూన్ 29, 30 తేదీల్లో నగరంలోని ఖార్గుల్ ప్రాంతంలో జరిపిన దాడుల్లో ఈ బంగారాన్ని స్వాధీనపర్చుకున్నామని, మహారాష్ట్ర సాంగ్లీకి చెందిన ఒక వ్యక్తిని అరెస్టు చేశామని పోలీసులు ప్రకటనలో వివరించారు. ఈ దాడిలో మరో 13 గ్రాముల వెండి తునకలు, నాలుగు మొబైల్ ఫోన్లు, రూ.3,755 నగదుతో పాటు రవాణాకు ఉపయోగించిన సంచులను స్వాధీనం చేసుకున్నారు.


సహజ సిద్ధమైన మెరుగు మీ సొంతం

# రోజువారీ అందాల రహస్యాలు!

నేటి ఉరుకుల పరుగుల జీవితంలో, కాలుష్యం, మానసిక ఒత్తిడి కారణంగా మన చర్మ సౌందర్యం దెబ్బతింటోంది. కేవలం మేకప్‌తో తాత్కాలికంగా అందాన్ని దాచడం కంటే, అంతర్గతంగా, సహజంగా చర్మాన్ని కాంతివంతంగా మార్చుకోవడం ముఖ్యం. ప్రముఖ బ్యూటీ నిపుణులు సూచిస్తున్న కొన్ని అద్భుతమైన రోజువారీ చిట్కాలు మీకోసం...

**1. అంతర్గత శుద్ధి - నీరే ప్రాణాధారం!**

చర్మం నిగనిగలాడాలంటే శరీరంలో తేమ శాతం తగ్గకూడదు. రోజుకు కనీసం లి8 గ్లాసుల (లేదా 2-3 లీటర్ల) నీరులి తాగడం వల్ల శరీరంలోని వ్యర్థాలు బయటకు పోయి, చర్మం సహజమైన మెరుపును సంతరించుకుంటుంది.

**2. ఆహారమే మీ అందం**

మనం తినే ఆహారమే మన ముఖంలో కనిపిస్తుంది. మీ దినచర్యలో లితాజా పండ్లు, ఆకుకూరలు, కూరగాయలులి ఎక్కువగా ఉండేలా చూసుకోండి. వీటిలోని విటమిన్లు, యాంటీఆక్సిడెంట్లు చర్మాన్ని యవ్వనంగా ఉంచుతాయి.

**3. సూర్య కిరణాల నుండి రక్షణ**

ఎండలో బయటకు వెళ్లినా, ఇంట్లో ఉన్నా ప్రతిరోజూ సన్‌స్క్రీన్ వాడటం అస్సలు మర్చిపోవద్దు. ఇది హానికరమైన యూవీ కిరణాల నుండి చర్మాన్ని రక్షించి, మచ్చలు, ముడతలు రాకుండా కాపాడుతుంది.




**4. రాత్రి వేళ సంరక్షణ**

**మేకప్ తొలగింపు:** ఎంత అలసిపోయినా సరే, పడుకునే ముందు ముఖంపై ఉన్న మేకప్‌ను పూర్తిగా తొలగించాలి. లేదంటే చర్మ రంధ్రాలు మూసుకుపోయి మొటిమలు వచ్చే ప్రమాదం ఉంది.

**మాయిశ్చరైజర్:** మీ చర్మ తత్వానికి (ఆయిలీ, డ్రై లేదా కాంబినేషన్) సరిపోయే మంచి మాయిశ్చరైజర్‌ను రాసుకోవడం ద్వారా రాత్రంతా చర్మం హైడ్రేటెడ్‌గా ఉంటుంది.

**5. వారాంతపు ప్రత్యేక శ్రద్ధ**

**ఫేస్ ప్యాక్:** వారానికి రెండు సార్లు సహజసిద్ధమైన లేదా మీ చర్మానికి సరిపడే ఫేస్ ప్యాక్స్ వేసుకోవడం వల్ల మృతకణాలు తొలగిపోయి ముఖం ఫ్రెష్‌గా మారుతుంది.

**హెయిర్ మసాజ్:** అందమైన జుట్టు కోసం వారానికి ఒకసారి గోరువెచ్చని నూనెతో తలకు మసాజ్ చేయండి. ఇది రక్తప్రసరణను పెంచి, జుట్టును దృఢంగా చేస్తుంది.

**6. చేతులు, కాళ్ల శుభ్రత**

ముఖంతో పాటు చేతులు, కాళ్లను కూడా రోజూ శుభ్రంగా కడుక్కుని, మాయిశ్చరైజ్ చేయడం ద్వారా పొడిబారకుండా, మృదువుగా ఉంచుకోవచ్చు.

**7. సౌందర్య నిద్ర**

రాత్రి వేళల్లో మన చర్మం తనని తాను రిపేర్ చేసుకుంటుంది. అందుకే రోజుకు లి7 నుండి 8 గంటల ప్రశాంతమైన నిద్రలి అవసరం. సరైన నిద్ర లేకపోతే కళ్ల కింద నల్లటి వలయాలు ఏర్పడతాయి.

# విశ్వం వాయిస్

అవినీతిపై - అక్షర సమరం...

VISWAMVOICE TELUGU DAILY

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎడిషన్లు




గురువారం, 02 జూలై, 2026

4

www.viswamvoice.com

సత్యం • సమగ్రం • సమాజ బాధ్యత

www.viswamvoice.com


# ముసురుమిల్లి ప్రాజెక్టు కాలువకు తక్షణమే పూడిక తీయాలి



**రంపచోడవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** పోలవరం జిల్లా, రంపచోడవరం నియోజక వర్గం, జిల్లా కేంద్రమైన రంపచోడవరంలో ఉన్న ఏపీ ఎస్టీ కమిషన్ చైర్మన్ క్యాంప్ ఆఫీస్ నందు ఏపీ ఎస్టీ కమిషన్ చైర్మన్ సోళ్ళ బొజ్జిరెడ్డికి కలిసి ఈ క్రింది సమస్యలు పరిష్కరించాలని ఏపీ ఆదివాసీ జేఏసీ రాష్ట్ర నాయకులు వినతి పత్రాలు అందజేశామని ఏపీ ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లంశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా తెల్లం శేఖర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం రైతులు మేలుకొరకు ముసురుమిల్లి ప్రాజెక్టు కాలువ పూడికతీతకు 70 లక్షలు మంజూరు చేశారు. కానీ ముసురుమిల్లి ప్రాజెక్టు ఇరిగేషన్ శాఖ అధికారులు దేవారం, శరభ వరం గ్రామపంచాయతీల రైతులకు సాగునీరు ఇవ్వకూడదని లక్ష్యంతో దేవారం గ్రామపంచాయతీ సరిహద్దులో జరుగుతున్న పనులను నిలిపివేసి మిషన్ వెనక్కి తీసుకెళ్లిపోయారు. తొలకరి ప్రారంభమైంది వ్యవసాయ పనులు మొదలు పెట్టారు కావున తక్షణమే మరల పూడిక తీత పనులు ప్రారంభించి దేవారం శరభవరం గ్రామపంచాయతీల రైతులకు సాగునీరు అందించాలని, చెరువులకు కొత్త స్లూయిజ్లు తూములు కలవర్టు తక్షణమే నిర్మించాలని, శిథిల వ్యవస్థలో ఉన్న అంగన్వాడి కేంద్రాల్లోనూ తొలగించి కొత్త అంగన్వాడి బిల్డింగులు మంజూరు చేయాలని, దేవారం గ్రామంలో శిథిల వ్యవస్థలో ఉన్న హెల్త్ సబ్ సెంటర్ ను తొలగించి కొత్త హెల్త్ సబ్ సెంటర్ బిల్డింగును నిర్మించాలని, దేవారం గ్రామంలో ఉన్న 250 కుటుంబాల ప్రజలకు ఆన్లైన్ సేవలు అందుబాటులో ఉండడం లేదు. కావున తక్షణమే బిఎస్ఎన్ఎల్ టవర్ మంజూరు చేయాలని, ఏజెన్సీ మారుమూల గ్రామాలకు తారు రోడ్లు మంజూరు చేయాలని, ఇందుకూరు గ్రామంలో విద్యుత్తు సబ్ స్టేషన్ తక్షణమే ఏర్పాటు చేసి విద్యుత్ కొరత నుండి విముక్తి కల్పించాలని, దేవారం గ్రామానికి వచ్చే బస్సు టైమింగ్స్ ఉదయం 8:30 గంటలకు సాయంత్రం ఐదు గంటలకు మార్పు చేయాలని, ఇందుకూరుపేట, కొండ మొదలు, దేవీపట్నం ప్రభుత్వ హాస్పిటల్స్‌కు అంబులెన్సులు తక్షణమే మంజూరు చేయాలని, చిన్నారి గండి ఆర్ అండ్ ఆర్ కాలనీ పెనుకిలపాడు గ్రామంలో సత్యసాయి మంచి నీటి ట్యాంకు నిర్మించి మంచినీళ్లు అందించాలని మరియు వ్యక్తిగత మరుగుదొడ్లు మంజూరు చేయాలని దండంగి, గంగంపాలెం, మూలపాడు, తోయ్యేరు గ్రామాలకు మంచి నీళ్లు తక్షణమే అందించాలని, ఇందుకూరుపేట ప్రభుత్వ పశువుల హాస్పిటల్‌కు డాక్టర్ నిర్మించాలని రంపచోడవరం కేంద్రంగా న్యాయ కళాశాల ఏర్పాటు చేయాలని మరియు ఏపీఎస్ఆర్టీసీ బస్ డిపో ఏర్పాటు చేయాలని, దేవీపట్నం ప్రభుత్వ జూనియర్ కళాశాల కు అనుబంధంగా హాస్టల్ బిల్డింగు నిర్మాణం కొరకు నిధులు మంజూరు చేయాలని, పెద్ద భీంపల్లి 2 ఆర్ అండ్ ఆర్ కాలనీ పినికిలపాడు గ్రామంలో ఉన్న ఎంపీపీ స్కూల్ ఈ విద్యా సంవత్సరంలోనే ప్రారంభించాలని, ఆదివాసీ రైతులకు సోలార్ ఫెన్సింగ్ 90 శాతం సబ్సిడీ ద్వారా మంజూరు చేయాలనిఆశ్రమ పాఠశాలలకు సోలార్ ఫెన్సింగ్ మంజూరు చేయాలని మరియు ఏఎన్ఎం పోస్టులు భర్తీ చేయాలని, ఆదివాసీ ప్రత్యేక డిఎస్సి ప్రకటించాలని, ఎస్టీ బ్యాక్లాగ్ పోస్టులు భర్తీ చేయాలని, ఐటీడీఏ ద్వారా ట్రైకార్ రుణాలు మంజూరు చేయాలని, ఆదివాసీ ప్రజలకు సింగిల్ విండో విధానం అమలు చేయాలని మరియు పోలవరం నిర్వాసితులకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం శాస్త్రీయ సమగ్ర పునరావాసం కల్పించాలని మొదలైన సమస్యలపై వినతి పత్రాలు అందజేశామన్నారు. ఈ పై సమస్యలపై ఏపీ ఎస్టి కమిషన్ చైర్మన్ సోళ్ళ బొజ్జిరెడ్డి స్పందిస్తూ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఆదివాసీ జేఏసీ మండల కార్యదర్శి యలగాడ నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి కారం రామన్న దొర, అరగాటి వీరభద్రారెడ్డి, కుంజం భద్రం దొర, మురళీ కృష్ణ, రామకృష్ణ మొదలైన వారు పాల్గొన్నారు.

# యాసిడ్ కీటకం శరీరానికి అంటకూడదు

**యాసిడ్ బీటెల్ పట్ల అవగాహన పెంచుకుని అప్రమత్తంగా ఉంటే చాలు**
**- డాక్టర్ భరత్ గూడూరి జనరల్ ఫిజీషియన్**



**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** యాసిడ్ బీటెల్ అనే కీటకం యాసిడ్ శరీరానికి అంటకూడదని, ఈ జీవిపై అవగాహన పెంచుకుని, అప్రమత్తంగా ఉంటే సరిపోతుందని విజయభారతి చెస్ట్ ఇన్స్టిట్యూట్ జనరల్ ఫిజీషియన్ డాక్టర్ భరత్ గూడూరి అన్నారు. ఇటీవల కాలంలో రాజమండ్రి పరిసర ప్రాంతాల్లో, ప్రధానంగా కడియం ప్రాంతంలో అధికంగా కనిపిస్తున్న ఈ యాసిడ్ బీటల్ కిటకంపై ప్రజలు అవగాహన పెంచుకుని అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ భరత్ గూడూరి చెప్పారు. దీనిని యాసిడ్ బిటెల్ లేదా రో డీటెయిల్ అని పిలుస్తారని, సైంటిఫిక్ గా పెడ్రస్ బీటెల్ అని అంటారని చెప్పారు. ఈ మధ్యకాలంలో వీటి సంఖ్య పెరుగుతుందని చెప్పారు. దీనిని సున్నితంగా నివారించవచ్చని వివరించారు. శరీరంపై వాలినప్పుడు నలిపిన, చంపిన పెడ్రస్ టాక్సిన్ అనే యాసిడ్ శరీరానికి తగిలితే మంట పుట్టడంతో పాటు దురద, బొబ్బర్లు వస్తాయని చెప్పారు. మంట రెండు మూడు రోజుల్లో తగ్గిపోతుందని, చర్మంపై మాత్రం వాలిన చోట దద్దుర్లు ఏర్పడతాయన్నారు. వాలినచోట పేపర్ తో కానీ గుడ్డతో గాని దాన్ని తొలగించే ప్రయత్నం చేయాలని, వాలిన చోట చన్నీళ్లతో సబ్బుతో బాగా కడగాలని చెప్పారు. ఈ కీటకం పర్యావరణ సమతుల్యతకు దోహదపడుతుందని, వాలిన చోట దులిపేస్తే సరిపోతుందని, రాత్రి సమయంలో వెలుతురుకు ఇళ్లల్లోకి వస్తుందని, అందుచేత తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కిటికీలకు మెస్సులు అమర్చుకుని, డిమ్లైట్ వాడి తదితర జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అవసరమైన పక్షంలో దగ్గర్లో ఉన్న చర్మవ్యాధుల స్పెషలిస్ట్‌ను గాని, జనరల్ ఫిజీషియన్ గాని సంప్రదించాలని డాక్టర్ భరత్ గూడూరి చెప్పారు.

ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లపై అధికారుల దృష్టి పడేలా...

# పదేపదే అదే నూనెతో వంటలు..?

**గోకవరంలో ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాలపై తనిఖీలు చేపట్టాలంటూ ప్రజల డిమాండ్**




**గోకవరం, విశ్వం వాయిస్ న్యూస్ జులై :** గోకవరంలోని పలు ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాల్లో వంటనూనెను మార్చకుండా పదేపదే విని యోగిస్తున్నారనే ఆరోపణలు స్థానిక ప్రజల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. పాత బస్టాండ్, ఆంజనేయస్వామి గుడి సెంటర్, ఆర్టీసీ కాంప్లెక్స్ పరిసర ప్రాంతాల్లోని కొన్ని ఫాస్ట్‌ఫుడ్ దుకాణాల్లో పలుమార్లు ఉపయోగించిన నూనెతోనే ఆహార పదార్థాలు తయారు చేస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. వైద్య నిపుణుల సూచనల ప్రకారం, ఒకే వంటనూనెను పలుమార్లు అధిక ఉష్ణోగ్రత వద్ద ఉపయోగించడం వల్ల హానికర రసాయనాలు ఏర్పడే అవకాశం ఉందని, అలాంటి ఆహారాన్ని తరచుగా తీసుకోవడం ఆరోగ్యానికి ప్రమాదకరమని హెచ్చరిస్తున్నారు. అయితే, క్యాన్సర్ వంటి వ్యాధులు ఒక్క కారణంతోనే వస్తాయని నిర్ధారించడం సాధ్యం కాదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఈ అంశంపై సంబంధిత ఆహార భద్రత, ఆరోగ్య శాఖ అధికారులు వెంటనే స్పందించి ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. నాణ్యత లేని నూనె వినియోగం, పరిశుభ్రత లోపాలు, ఆహార భద్రత ప్రమాణాలను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. "ప్రజల ఆరోగ్యం కంటే వ్యాపారం ముఖ్యం కాకూడదు. అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటేనే ప్రజల్లో నమ్మకం పెరుగుతుంది" అని గ్రామస్థులు అభిప్రాయపడుతున్నారు.

# 28వ డివిజన్లో సామాజిక పెన్షన్‌లు దాలిపర్తి వేమన పంపిణీ



**రాజమహేంద్రవరం రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమండ్రి రూరల్ నియోజకవర్గం 28వ డివిజన్లో కూటమి ప్రభుత్వం సచివాలయ సిబ్బంది ద్వారా అందిస్తున్న "ఎన్టీఆర్ భరోసా పెన్షన్" పంపిణీ కార్యక్రమం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాజమండ్రి రూరల్ నియోజకవర్గం ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్న ఆదేశాల మేరకు సక్రమంగా, జరగాలనే ఆదేశాలను అనుసరించి "కుమ్మర శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్ దాలిపర్తి వేమన" పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో సచివాలయ సిబ్బందితో కలిసి పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా దాలిపర్తి వేమన లబ్ధిదారులతో మాట్లాడుతూ "ప్రతినెల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 62 లక్షల మంది లబ్ధిదారులకు 2,750 కోట్ల రూపాయలను" వృద్ధులకు, వితంతువులకు 4,000/-, దివ్యాంగుల కు 6,000/-, కిడ్నీ వ్యాధులతో డయాలసిస్ వారికి 10,000/-, ఇతర తీవ్రమైన వ్యాధులతో బాధపడుతున్న వారికి 15,000/- ప్రతినెల తప్పనిసరిగా ఒకటవ తేదీన "ఎన్టీఆర్ భరోసా పెన్షన్" ద్వారా పెన్షన్ పంపిణీ జరుగుతుందని, ఒకవేళ 1 తేదీ ఆదివారం లేదా సెలవు దినం అయినా ఎడల, ఆ ముందు రోజు 30 లేదా 31 వ తారీఖున పెన్షన్ పంపిణీ జరుగుతుందని, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ చేయు ప్రభుత్వ సిబ్బంది 1 తేదీ ఉదయమే లబ్ధిదారుల ఇంటికి వెళ్లి, లబ్ధిదారులు అందరూ అందుబాటులో ఉంటే, ఒక్కరోజులో పెన్షన్ కార్యక్రమాన్ని పూర్తి చేసే విధంగా "ఎన్టీఆర్ భరోసా సంక్షేమ పథకాన్ని" అమలు చేస్తున్న "ఈ ప్రభుత్వం మంచి ప్రభుత్వం" అని ఈ సందర్భంగా దాలిపర్తి వేమన తెలియజేయడం జరిగింది.

ప్రతి పేదవాడికి సంక్షేమం అందేలా

# కూటమి ప్రభుత్వం కృషి

**ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు**



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** కూటమి ప్రభుత్వం ప్రతీ పేదవాడికి సంక్షేమం అందేలా కృషి చేస్తుందని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు అన్నారు. ఇళ్ళ వద్దకు వెళ్ళి క్రొత్తగా మంజూరు అయిన ఎన్టీఆర్ భరోసా ఫించన్లు రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ వేగుళ్ళ జోగేశ్వరరావు బుధవారం పంపిణీ చేశారు. ఈ నెల కొత్తగా మంజురైన స్పౌస్ ఫించన్లు సంబంధించి 20వ వార్డు, గొల్లపుంత కాలనీ టిడ్కో కాలనీలకు చెందిన వాసంశెట్టి లక్ష్మి, అలమండ లోవ కుమారి, పావులూరి మణి శ్రీ పెంటా మంగయమ్మ కు ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు స్వయంగా ఫించన్లు పంపిణీ చేశారు. ఈ ఫించన్లు పంపిణీ కార్యక్రమం లో ఎమ్మెల్యే వేగుళ్ళ పెద్ద అల్లుడు పి.సురేష్ కుమార్ టి.డి.పి నాయకులు మెడింటి సూర్యప్రకాష్, కూటమి నాయకులు ఫించను పంపిణీ సిబ్బంది పాల్గొన్నారు.

డాక్టర్స్ డే సందర్భంగా

# వైద్యులకు విజ్ఞాన్ విద్యార్థుల చిరు సత్కారం



**రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** జాతీయ డాక్టర్స్ డేను పురస్కరించుకుని విజ్ఞాన్ విద్యా సంస్థల విద్యార్థులు సమాజానికి విశేష సేవలు అందిస్తున్న వైద్యులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరి ఆరోగ్య పరిరక్షణలో వైద్యుల పాత్ర ఎంతో గొప్పదని, ఎన్నో ప్రాణాలను కాపాడుతూ వైద్యులు సమాజానికి ప్రాణదాతలుగా నిలుస్తున్నారని ఈ సందర్భంగా విద్యార్థులు పేర్కొన్నారు. వైద్య వృత్తి కేవలం ఉద్యోగం కాకుండా సేవా భావంతో కూడిన గొప్ప బాధ్యత అని తెలిపుతూ వైద్యులను పుష్పగుచ్ఛాలను అందించి, శుభాకాంక్షలు తెలిపుతూ వారి సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ డా. మల్లిడి అమ్మిరెడ్డి మాట్లాడుతూ.. వైద్యులు తమ జ్ఞానం, నైపుణ్యం, మానవతా దృక్పథంతో ఎన్నో ప్రాణాలను రక్షిస్తున్నారని, వైద్యుల సేవలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని, డాక్టర్స్ డే సందర్భంగా వివిధ విభాగాలలో సేవలందిస్తున్న వైద్యులకు శుభాకాంక్షలు తెలిపారు. వైద్య వృత్తి సేవా దృక్పథానికి ప్రతీక అని, సమాజ ఆరోగ్య పరిరక్షణ కోసం అంకితభావంతో పనిచేస్తున్న ప్రతి వైద్యుడికి అభినందనలు డా. శేషా వేణి మల్లిడి తెలిపారు. విద్యార్థులు సేవాభావాన్ని పెంపొందించుకుని సమాజానికి ఉపయోగపడే పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

# దేవాలయ హుండీ చోరీ కేసులో నిందితుడికి జైలు శిక్ష

**రాయవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** దేవాలయ హుండీ చోరీ కేసులో నిందితుడికి న్యాయస్థానం జైలు శిక్ష విధించింది. రాయవరం పోలీస్ స్టేషన్ పరిధిలోని చెల్లూరు గ్రామంలోని శ్రీ బాల త్రిపుర సుందరి దేవి సమేత అగస్తీశ్వర స్వామి దేవాలయంలో ఏప్రిల్ 13వ తేదీ రాత్రి హుండీ పగలగొట్టి రూ.5 వేల నగదు, సీలింగ్ ఫ్యాన్ దొంగిలించిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా చెల్లూరు గ్రామానికి చెందిన కానూరు మల్లేష్‌ను పోలీసులు అరెస్ట్ చేసి, దొంగిలించిన సొత్తును స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరుపరిచారు. కేసు విచారణ అనంతరం అనపర్తి ఫస్ట్ క్లాస్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఎం. వంశీకృష్ణ నిందితుడికి 2 నెలల 10 రోజుల జైలు శిక్షతో పాటు రూ.50 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. కేసులో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఓ. మహాలక్ష్మి వాదనలు వినిపించారు. సాక్షులను కోర్టులో హాజరుపరిచగా కేసు ను పర్యవేక్షించిన రాయవరం ఎస్సై డి.సురేష్ బాబు, కోర్టు కానిస్టేబుల్ సత్యకుమార్‌లను ఉన్నతాధికారులు అభినందించారు.

# పాఠశాలకు టివి, మెగా ఫోన్ బహుకరణ



**రాజమహేంద్రవరం రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక గౌతమి ఘాట్‌లోని రాజమండ్రి వర్తకుల స్వచ్ఛంద సేవా సంస్థ చాంబర్ ఆఫ్ కామర్స్ ట్రస్ట్ తమ ఉచిత సేవా కార్యక్రమాలలో భాగంగా స్థానిక కోనేరు పేట, పిడింగొయ్యిలోని మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల వారి అభ్యర్థన మేరకు రూ. 45 వేల 43 ఇంచెస్ టివి, ఒక మెగా ఫోన్ ను అందజేశారు. ట్రస్ట్ ఉపాధ్యక్షులు మద్దుల మురళీకృష్ణ, సహాయ కార్యదర్శులు కాలెపు వెంకట వీరభద్రరావు, యలమర్తి వెంకటేశ్వరరావు(బాబు), దేవత సుధాకర్, డైరెక్టర్స్ లక్కోజీ వీరభద్రరావు(లక్కోజీ), మండవిల్లి వెంకట్రాజు(రాజా), రాయవరపు గోపాలకృష్ణ తదితరుల చేతుల మీదుగా స్కూల్ ప్రధానోపాధ్యాయులు పి. నాగప్రభకు అందజేయడం జరిగిందని ట్రస్ట్ గౌరవ కార్యదర్శి బాలనాగు బలేష్ గుప్తా తెలిపారు.

# బిఎంపి రాజమండ్రి రూరల్ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా డాక్టర్స్ డే



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా బీఎంపీ రాజమండ్రి రూరల్ శాఖ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ధవళేశ్వరం పి.హెచ్.సి డాక్టర్ ఆర్.వి.వి సత్యనారాయణ ఎం.బి.బి. ఎస్, డాక్టర్ రోహిత ఎం.బి.బి.ఎస్, డాక్టర్ ఆర్.దివ్య పావని, ఎం.బి.బి.ఎస్.లకు డాక్టర్స్ డే శుభాకాంక్షలు తెలిపి చిరుసత్కారం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సంఘ ఉపాధ్యక్షులు ఎస్.కె. ఇమామ్, జిల్లా అధ్యక్షులు పి. సత్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు ఎం.వి.వి.సత్యనారాయణ, రాజమండ్రి రూరల్ మండలశాఖ అధ్యక్షుడు ఎస్.కె. సిద్ధు, కార్యదర్శి పి.వి. వెంకటేశ్వరావు, కోశాధికారి ఆర్.ఈశ్వర్ ప్రభు, ఉపాధ్యక్షులు వి.వి.రమణ, కమిటీ సభ్యులు ఎస్.వీ. మోహన్, టి.వెంకటేశ్వరావు, బీఎంపీ రూరల్ సభ్యులు ఓ.గంగాధర, ఎస్.కె.బాబాజీ, ఎం.శ్రీనివాస్, వి. మోహన్, వి.నాగరాజు పాల్గొన్నారు.


మా 'విశ్వం వాయిస్' వాట్సాప్ ఛానల్‌లో జాయిన్ అవ్వండి!
నిజాయితీ గల వార్తలు.. నిరంతర అప్‌డేట్స్!
- బ్రేకింగ్ న్యూస్ అప్‌డేట్స్
- రోజువారీ తెలుగు దినపత్రిక PDF
- అంతర్జాతీయ, జాతీయ వార్తలు
- విశ్లేషణాత్మక కథనాలు

VISWAM VOICE BREAKING NEWS
WhatsApp channel
మీ ఫోన్ కెమెరాతో స్కాన్ చేసి గ్రూపులో చేరండి
JOIN NOW
లింక్ ద్వారా కూడా జాయిన్ అవ్వండి:
https://whatsapp.com/channel/0029Va7zLL1E50Uhr9gpAR1E
మాతో పాటు మరిన్ని వార్తలు మరియు తాజా అప్‌డేట్స్ తెలుసుకోండి.





# ద్రాక్షారామంలో కలెక్టర్ మహేష్ విస్తృత పర్యటన

**సంఘం కాలనీలో 'ఎన్టీఆర్ భరోసా' పింఛన్ల పంపిణీ - ఇటీవల అగ్నిప్రమాదానికి గురైన 48 దుకాణాల పరిశీలన**

**రైతులు సేంద్రియ ఎరువుల వినియోగాన్ని పెంచుకోవాలి : కలెక్టర్ - 11 సంక్షేమ హాస్టళ్లలో 'నెట్ జీరో' బ్లాక్ ప్లాంటేషన్ పూర్తి చేయాలి**



**రామచంద్రపురం/ అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ బుధ వారం రామచంద్రపురం మండలం ద్రాక్షారామం పరిధిలో విస్తృతంగా పర్యటించారు. ముందుగా ద్రాక్షారామం సంఘం కాలనీ నందు ఆయన పర్యటించి, లబ్ధిదారులకు 'ఎన్టీఆర్ భరోసా' సామాజిక భద్రతా పింఛన్లను స్వయంగా పంపిణీ చేశారు. అనంతరం స్థానిక మార్కెట్ యార్డ్ వద్ద ఇటీవల సంభవించిన అగ్నిప్రమాదంలో పూర్తిగా కాలిపోయిన 48 దుకాణా లను జిల్లా కలెక్టర్ నిశితం గా పరిశీలించి, బాధితుల వివరాలను అడిగి తెలుసు కున్నారు. అలాగే స్థానిక స్పోర్ట్స్ ఇండోర్ స్టేడియం భవన స్థితిగతులను, సదుపాయాలను ఆయన తనిఖీ చేశారు.ఎరువుల పంపిణీలో పారదర్శకత ఉండాలన్నారు. కలెక్టర్ ద్రాక్షారామంలోని పీఎం కిసాన్ సమృద్ధి కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్, అక్కడ ఏపీ ఎయిమ్స్ యాప్ ద్వారా రైతులకు డీలర్లు ఎరువులను సరఫరా చేస్తున్న విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. రికార్డులను, భౌతిక స్టాకును నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో కలెక్టర్ ముచ్చటిస్తూ, రైతాంగ అవసరాలకు తగ్గట్టుగా ప్రభుత్వం యూరియా సహా అన్ని ఎరువులను నిరంతరం సరఫరా చేస్తుందని హామీ ఇచ్చారు. అయితే, భూసా రాన్ని కాపాడుకునే దిశగా రైతులంతా సేంద్రియ ఎరువుల వినియోగాన్ని పెంచుకోవాలని సూచించారు. డీలర్లకు, రైతులకు మధ్య ఎటువంటి అపో హలు తలెత్తకుండా ఎరువుల పంపిణీ సాగాలని, ఇందుకు సచివాలయ వ్యవసాయ సహాయకులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆదేశించారు.

**హాస్టళ్లలో 'నెట్ జీరో' మొక్కల పెంపకం**

అనంతరం కలెక్టరేట్ వేదికగా నెట్ జీరో ఎనర్జీ, పర్యావరణ సమతు ల్యతపై 'హార్ట్ ఫుల్‌నెస్' ప్రతినిధులు, డ్వామా పీడీ వి. రాంగోపాల్‌లతో కలెక్టర్ సమీక్ష స్థానిక కలెక్టరేట్ నందు నిర్వహించారు. జిల్లాలోని 11 సంక్షేమ వసతిగృహాలలో ఖాళీగా ఉన్న విస్తీర్ణంలో సంస్థాప రమైన బ్లాక్ ప్లాంటేషన్ మొక్కల పెంపకం ప్రక్రియను రాబోయే జూలై మాసంలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. నాటబోయే మొక్కల రకాల గురించి ఆరా తీశారు. 'నెట్ జీరో హెల్దీ క్యాంప్' ద్వారా నిర్దేశించిన 4 ప్రాధాన్యత అంశాలలో సత్ఫలితాలు సాధించాలని, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపు నిచ్చారు.ఈ పర్యటన, సమీక్షా కార్యక్రమాలలో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ సాధికారత అధికా రిణి పి. జ్యోతిలక్ష్మీదేవి, హార్ట్ ఫుల్‌నెస్ సంస్థ ప్రతినిధి ప్రత్యూష, స్థానిక రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## మానవత్వంలో ముందున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

**రావులపాలెం మండలానికి చెందిన 92మందికి**
**రూ.41,06,736ల విలువైన చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే బండారు**



**రావులపాలెం విశ్వం వాయిస్ న్యూస్ :** ముఖ్యమంత్రి చంద్రబాబు గొప్ప మానవతావాది అని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. మంగళవారం రావులపాలెం క్యాంప్ కార్యాలయంలో రావులపాలెం మండలానికి చెందిన 92మందికి రూ.41,06,736ల విలువైన సహాయనిధి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదవారు అనారోగ్యం పాలై వైద్యం చేయించుకోవడానికి పడే ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని సీఎం రిలీఫ్ ఫండ్ చేతికి ఎముక లేకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు అందిస్తున్నారని ఎమ్మెల్యే కొనియాడారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ముఖ్యమంత్రి సహాయనిధి ఎవ్వరికీ అందలేదన్నారు. 2014- 19 ప్రభుత్వ హయాంలో సైతం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ విధంగానే సహాయనిధి అందించారని గుర్తు చేశారు. కొత్తపేట నియోజకవర్గంలో దరఖాస్తు చేసుకున్న ప్రతీ ఒక్కరికీ సహాయనిధి అందిస్తున్నందుకు ముఖ్యమంత్రికి ఎమ్మెల్యే కృతజ్ఞత తెలిపారు.

## బండారులంకలో మొక్కలు నాటిన ఎస్‌బీఐ అధికారులు




**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కేవలం బ్యాంకింగ్ సేవలకు మాత్రమే పరిమితం కాకుండా, సామాజిక బాధ్యతలో భాగంగా సమాజ హిత కార్యక్రమాలను నిర్వహించడంలో ఎల్లప్పుడూ ముందుంటుందని ఎస్‌బీఐ జిల్లా రీజినల్ మేనేజర్ అశోక్ నాగరాజన్ పేర్కొన్నారు. భారతీయ స్టేట్ బ్యాంక్ అవతరణ దినోత్సవం సందర్భంగా అమలాపురం మండలం బండారులంక ఎంపీపీ పాఠశాలలో నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అశోక్ నాగరాజన్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ చీఫ్ మేనేజర్ సత్యప్రసాద్, బ్రాంచ్ మేనేజర్ వై.ఎల్. శ్రీధర్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జి.కె. దుర్గాదేవి తదితరులు పాల్గొన్నారు.

**డెంగ్యూ నివారణపై పోస్టర్లను**

## ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్




**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** డెంగ్యూ వ్యాధి నివారణపై ప్రజల్లో అవ గాహన పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ అన్నారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ వై.ఖోమ్ నైడియా దేవితో కలిసి డెంగ్యూ నివారణ అవగాహన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ డెంగ్యూ నివారణకు ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవడం, వారానికి ఒకసారి 'డ్రై డే' పాటించడం, దోమలు పెరగకుండా జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా డెంగ్యూ వ్యాప్తిని అరికట్టవచ్చని తెలిపారు. జ్వరం వచ్చిన వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించి వైద్య పరీక్షలు చేయించుకోవాలని ప్రజలకు సూచించారు. జాయింట్ కలెక్టర్ వై. ఖోమ్ నైడియా దేవి మాట్లాడుతూ, గ్రామాలు, పట్టణాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. ప్రజల సహకారంతోనే డెంగ్యూ నియంత్రణ సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి కె.ఎన్. శ్రీనివాస్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా వైద్యులకు సత్కారం




**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని వాకర్స్ హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ప్రైవేటు హాస్పిటల్‌లో వైద్యులను ఘనంగా సన్మానించారు. సమాజ ఆరోగ్య పరిరక్షణలో వైద్యులు అందిస్తున్న విశిష్ట సేవలను కొనియాడుతూ వారికి శాలువాలు కప్పి, జ్ఞాపికలు అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం నిరంతరం సేవలందిస్తున్న వైద్యుల సేవలు అమూల్యమైనవని పేర్కొన్నారు. వైద్య వృత్తి ఒక సేవా యజ్ఞమని, ప్రతి ఒక్కరూ వైద్యుల సేవలను గౌరవించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ హెల్త్ క్లబ్ అధ్యక్షుడు గోటేటి గంగాధర్, కార్యదర్శి కుడిపూడి త్రినాథ్, కోశాధికారి పడాల నాయుడు, డిప్యూటీ గవర్నర్ బోణం సత్యవరప్రసాద్, నూకల సత్యనారాయణ, పుత్సా కామేశ్వరరావు, యర్రమిల్లి సత్యనారాయణమూర్తి, వలవల రెడ్డి నాయుడు, శ్రీఖాకుళపు రామకృష్ణ, పసుమర్తి గోపాలకృష్ణ, పచ్చిగొళ్ల రాజా, వాసంశెట్టి హరిబాబు తదితరులు పాల్గొని వైద్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

**అంబాజీపేట మండల ప్రజా పరిషత్**

## జనరల్ బాడీ సమావేశంలో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ




**అంబాజీపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో పి.గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు గిడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో విద్యుత్ సమస్యలు అధికంగా ఉన్నాయని, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను విద్యుత్ శాఖ అధికారులు అత్యంత ప్రాధాన్యతతో తీసుకుని త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. మహిళల ఆర్థికాభివృద్ధికి డ్వాక్రా సంఘాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొంటూ, సంబంధిత అధికారులు అందిస్తున్న సలహాలను మహిళలు సద్వినియోగం చేసుకుని రుణాలు పొందాలని సూచించారు. ఆ రుణాల ద్వారా స్వయం ఉపాధి అవకాశాలను పెంపొందించుకుని ఆర్థికంగా మరింత బలోపేతం కావచ్చని తెలిపారు. వ్యవసాయ రంగంలో ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విధానాన్ని వివరిస్తూ, రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాల వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తే, వాటికి అనుగుణంగా అధికారులు అవసరమైన సరఫరాను అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. ఈ విధానంపై ప్రతిపక్షాలు అనవసర ఆరోపణలు చేస్తున్నాయని పేర్కొంటూ, ఈ యాప్ వల్ల ఎరువులు, విత్తనాలు పక్కదారి పట్టకుండా నేరుగా అర్హులైన రైతులకు అందుతాయని, రైతుల ప్రయోజనాల పరిరక్షణే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, స్పెషల్ ఆఫీసర్లు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

**సాంఘిక సంక్షేమ శాఖ అధికారులపై**

## చర్యలు తీసుకోవాలి

**దళిత చైతన్య వేదిక**



**రాజోలు, విశ్వం వాయిస్ న్యూస్ :** కొత్తగా రాజోలు ఎస్సీ బాలుర వసతి గృహాన్ని నిర్మిస్తామనే సాకుతో ఉన్నటువంటి రాజోలు ఎస్సీ బాలుర వసతి గృహాన్ని దురుద్దేశ్యంతో కూల్చేసిన సాంఘిక సంక్షేమ శాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని దళిత చైతన్య వేదిక నాయకులు రాజోలు తాసిల్దార్ కార్యాలయ ఇంచార్జ్ కు, రాజోలు ఎంపీడీవో కె వెంకటేశ్వరరావు కు మెమోరాండం అందజేశారు. ఈ మేరకు రాజోలు తాసిల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం దళిత చైతన్య వేదిక నాయకులు మాట్లాడుతూ గత సంవత్సరం జూలై నెలలో కూల్చేసిన రాజోలు బాలుర వసతి గృహం యొక్క నిర్మాణ పనులు నేటి వరకూ చేపట్టకపోవడంపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. వెంటనే రాజోలు బాలుర వసతి గృహాన్ని నిర్మించాలని, ఎస్సీ బాలుర వసతి గృహ నిర్మాణ పనులు చేపట్టడంలో నిర్లక్ష్యం చేసిన సంబంధిత అధికారులపై చర్యలు చేపట్టాలని నాయకులు డిమాండ్ చేశారు. వసతి గృహాన్ని కూల్చిన మెటీరియల్ ఏమైయిందో దర్యాప్తు చేపట్టాలని రాజోలు ఎంపీడీవోను కోరారు. జూలై 10 వ తారీఖు లోగడ నిర్మాణ పనులు ప్రారంభించకపోతే నియోజకవర్గ వ్యాప్తంగా దళిత సంఘాలన్నింటిని కలుపుకుని పెద్దఎత్తున ఆందోళన చేపడతామని, ఈ విష్యాన్ని ప్రజాప్రతినిధుల దృష్టికి, రాష్ట్ర ఎస్సీ కమిషన్ దృష్టికి, జాతీయ ఎస్సీ కమిషన్ దృష్టికి తీసుకెళ్ళతామని ఈ సందర్భంగా దళిత చైతన్య వేదిక నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వేదిక వ్యవస్థాపకులు బత్తుల మురళీకృష్ణ, డిహెచ్పీఎస్ జిల్లా గౌరవ అధ్యక్షులు దేవ రాజేంద్రప్రసాద్, వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు చిలకపాటి శ్రీధర్, జిల్లా అధ్యక్షులు లిఖితపూడి బుజ్జి, జిల్లా ప్రధాన కార్యదర్శి బొడ్డపల్లి ప్రసాద్, మండల అద్యక్షులు మందపాటి మధు, తోటే ప్రతాప్, డొల్లా జాన్ మార్టిన్, నీతిపూడి సత్యనారాయణ, గెడ్డం చిన్న, గోగి మోహన్, పొన్నమాటి భాస్కర్, మెడబల శ్యాంశేఖర్, బత్తుల సరస్వతీరావు, కారుపల్లి గోపాలన్, డాక్టర్ బాబు, బి.రవిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ రవితేజ సేవలు అభినందనీయం

**కోనసీమ కేర్ అధినేత డాక్టర్ రవితేజకీ శుభాకాంక్షలు తెలిపిన పలువురు**



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రపంచ డాక్టర్స్ డే సందర్భంగా నిత్యం పేదప్రజలకు సేవలు అందిస్తూ,కోవిడ్ సమయంలో పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందిస్తూ అనేక ప్రాణాలు కాపాడిన కోనసీమ కేర్ హాస్పిటల్ అధినేత డాక్టర్ కారెం రవితేజకి డాక్టర్స్ డే సందర్భంగా పరమట భీమమహేష్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కోనసీమ కేర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో అంబేద్కర్ కోనసీమ జిల్లాలో అనేక గ్రామాల్లో ఉచిత వైద్య మెడికల్ క్యాంప్‌లు ఏర్పాటు చేస్తూ, పేద ప్రజలకు అండగా నిలుస్తున్న రవితేజ సేవలు అభినందనీయమన్నారు. అలాగే కరోనా సమయంలో డాక్టర్ 1రవితేజ సేవలు మరువలేమని, అనేక సేవా కార్యక్రమాలు చేస్తూ పేదలు అండగా నిలుస్తున్న డాక్టర్ రవితేజకు కృతజ్ఞతలు తెలుపుతూ డాక్టర్స్ డే సందర్భంగా పలువురు శుభాకాంక్షలు తెలిపారు.



ముమ్మిడివరం మండలం - అనాతవరం గ్రామంలో గ్రామ సమాఖ్య నూతన భవన శంకిస్థాపన కార్యక్రమం జరిగింది. స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, అధికారులు, ద్వాక్రా గ్రూప్ సభ్యులు, ప్రజలు,పార్టీ నాయకులు, మరియు గ్రామస్థులు, పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సేవలకు ప్రశంసలు



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆర్యవైశ్య సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సాధారణ సమావేశం స్థానిక వాసవి ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ సాయి శిల్ప 'థైరాయిడ్' మరియు 'వినికిడి సమస్యలు', వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సభ్యులకు అవగాహన కల్పించారు. అనంతరం మెడ్ యునైటెడ్ హాస్పిటల్‌కు చెందిన డాక్టర్ కిషోర్ గ్యాస్ట్రిక్ సంబంధిత సమస్యలు, వాటి నివారణ మార్గాలను వివరించగా, డాక్టర్ ఉదయ్ ఆస్పత్రి అందిస్తున్న వైద్య సేవలు, ప్రజల కోసం ప్రవేశపెట్టిన నూతన ఆరోగ్య పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు యర్రమిల్లి విశ్వేశ్వరరావు మాట్లాడుతూ, గత రెండు నెలలుగా ఆర్యవైశ్య సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందుకోసం సుమారు రూ.1 లక్ష వ్యయం చేయగా, దాదాపు 60 వేల మందికి దాహార్తి తీర్చినట్లు వెల్లడించారు. అలాగే ఆర్టీసీ డిపో మేనేజర్ అభ్యర్థన మేరకు ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఏడు రోజుల పాటు ప్రత్యేకంగా మజ్జిగ పంపిణీ నిర్వహించామని తెలిపారు. ఈ సేవలను గుర్తించి ఆర్టీసీ అధికారులు అసోసియేషన్‌కు ప్రశంసా పత్రాన్ని అందజేసినట్లు పేర్కొన్నారు. అసోసియేషన్ సేవలకు ఆకర్షితులై సమావేశంలో మరో 10 మంది సభ్యులుగా చేరారు. సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పచ్చిగోళ్ళ నర్సిబాబు ఏడుగురు కొత్త సభ్యులను చేర్పించారు. సమావేశంలో పచ్చిగోళ్ళ నర్సిబాబు 55వ వివాహ వార్షికోత్సవం, పాబోలు రాంబాబు జన్మదినాన్ని సభ్యులు ఘనంగా నిర్వహించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి నూలు సూర్య ప్రభాకర్ రావు, కోశాధికారి శ్రీఖాకోళపు రామకృష్ణ, ముఖ్య సలహాదారు నంబూరి విశ్వనాథం, కోఆర్డినేటర్ నంబూరి శ్రీనివాస్‌తో పాటు 100 మందికి పైగా సభ్యులు పాల్గొన్నారు. సమావేశం సేవా కార్యక్రమాలపై ప్రశంసల మధ్య విజయవంతంగా ముగిసింది.

## లబ్ధిదారులకు స్వయంగా పెన్షన్‌లు అందజేసిన ఎమ్మెల్యే దాట్ల



**అనాతవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ముమ్మిడివరం మండలం అనాతవరంలో నిర్వహించిన ఎన్టీఆర్ పెన్షన్ భరోసా కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు పాల్గొని లబ్ధిదారులకు స్వయంగా పెన్షన్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం పెన్షన్‌ను ఒక పథకంగా కాదు, పేదల జీవితానికి భరోసాగా రూపకల్పన చేశారన్నారు. వృద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళలలకు ప్రతినెలా ఇంటి ముంగిటకే పింఛన్ అందించడం కూటమి ప్రభుత్వ సంకల్పమని, పేదల గౌరవాన్ని కాపాడటమే మా ప్రభుత్వ లక్ష్యమన్నారు. అలాగే ఒక్క లబ్ధిదారుడూ వెనుకబడకుండా, అర్హులందరికీ న్యాయం జరిగేలా ప్రభుత్వం పనిచేస్తోంది" అని స్పష్టం చేశారు. పెన్షన్ భరోసా ద్వారా పేదల ముఖాల్లో చిరునవ్వు తీసుకురావడమే తమ పాలన ఉద్దేశమని పేర్కొంటూ, ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గుత్తుల సాయి కూటమి నేతలు, కార్యకర్తలు, అభిమానులు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

**ముమ్మిడివరం నియోజకవర్గంలో**

## భారీగా ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ



**ముమ్మిడివరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద, మధ్య తరగతి కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోందని ప్రభుత్వ విప్, ముమ్మిడివరం శాసనసభ్యులు దాట్ల సుబ్బరాజు (బుచ్చిబాబు) వెల్లడించారు. మురమళ్ళలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కుల పంపిణీ కార్యక్రమంలో భాగంగా 173మంది లబ్ధిదారులకు రూ 1.35 కోట్ల రూపాయల విలువైన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు మాట్లాడుతూ ప్రజలు అనారోగ్యం లేదా ఇతర అత్యవసర పరిస్థితుల్లో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొన్నప్పుడు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో ఉపయోగపడుతోందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సహాయం అందేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. సీఎంఆర్ఎఫ్ ద్వారా అందుతున్న ఆర్థిక సహాయం అనేక కుటుంబాలకు కష్టకాలంలో భరోసాగా నిలుస్తోందని, ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే ముమ్మిడివరం నియోజకవర్గంలో ఇప్పటి వరకు 1130 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.7.50 కోట్లు రూపాయలు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం అందించినట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు శ్రీ గుత్తుల సాయి, సీనియర్ నాయకులు కూటమి పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## రేపు అమలాపురం రూరల్ గ్రామాల్లో పవర్ కట్

**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** అమలాపురం రూరల్ 33/11కేవీ కామనగరువు సబ్ స్టేషన్ పరిధిలోని 11కేవీ ఫీడర్లపై చెట్లు కొమ్మలు తొలగించుట కారణంగా జూలై 2న అమలాపురం రూరల్ గ్రామాల్లో పవర్ కట్ చేయడం జరుగుతుందని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.రాంబాబు తెలియజేశారు. ఏ.వేమవరం,న్యూ హెచ్బీ కాలనీ, అమలాపురం కోర్టు, వీసీహెచ్ పూడి ఫీడర్లపై చెట్లు కొమ్మలు తొలగించే నిమిత్తం కామనగరువు, భట్నవిల్లి, జనుపల్లి, నల్లమిల్ల, ఏ వేమవరం, వన్నె చింతలపూడి , సమనస, రంగాపురం, తాండవల్లి, సవరపాలెం, రెడ్డిపల్లి మొదలైన గ్రామాలకు ఉదయం 8. గంటల నుండి మధ్యాహ్నం 2. గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయడం జరుగుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాంబాబు వెల్లడించారు. ఈ విద్యుత్ అంతరాయనికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.



# వైద్యులను సన్మానించిన పిఎంపీ అసోసియేషన్



**కాజులూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** అంతర్జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా కమ్యూనిటీ పారామెడిక్స్ & ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ది పిఎంపి అసోసియేషన్) కాజులూరు మండల యూనిట్ ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం గొల్లపాలెం వైద్యాధికారిణి డాక్టర్ సివిఎల్ శ్రేయ, డాక్టర్ ఎన్ సౌజన్య లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అంకిత భావంతో రోగులకు వైద్యులు అందిస్తున్న వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాజులూరు మండల కన్వీనర్ జెవివి సూర్యనారాయణమూర్తి, కో కన్వీనర్ వినాయక కుమార్, పియల్ శ్రీనుబాబు, సల్మాన్ రాజు, పి సురేష్, ఎమ్ పిహెచ్. ఇఓ సిహెచ్ సూర్యారావు ఆరోగ్యసిబ్బంది శ్రీమతి లోవలక్ష్మి, శ్రీమతి ధనలక్ష్మి శ్రీమతి పాపకుమారి శ్రీమతి ఉమా కుమారి శ్రావణి తదితరులు పాల్గొన్నారు

# శ్రీ చైతన్య విద్యార్థులచే పర్యావరణ పరిరక్షణ ర్యాలీ

**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** రావులపాలెం శ్రీ చైతన్య హై స్కూల్ విద్యార్థులచే స్మార్ట్ లివింగ్ మిషన్ హరితోదయ ప్రోగ్రాంలో భాగంగా ఊబలంక గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు . ఈ కార్యక్రమం నకు ఆర్ ఐ నరేష్ , ప్రిన్సిపాల్ జగదీష్ అధ్యక్షతన ర్యాలీ జరుగగా విద్యార్థులందరూ ప్లకార్డులు పట్టుకుని గ్రామస్తులందరి దగ్గరికి వెళ్లి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, డస్ట్ బిన్స్ వాడాలని, అందరరూ చెట్లను పెంచాలని , ప్లాస్టిక్ వాడకం తగ్గించాలని వాటర్ వృధాగా చేయకూడదని ఇంటి చుట్టూ మురికి గుంటలు లేకుండా ఉంచుకోవాలని, దోమతెరలు వాడాలని ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ డీన్ కే ఎన్ వి సతీష్, సి బ్యాచ్ ఇన్చార్జ్ వై ఎస్ ఎన్ మూర్తి ,ఏవో




రాజు, ప్రైమరీ ఇన్చార్జి కుమారి, ప్రీ ప్రైమరీ ఇన్చార్జి లలిత, మరియు ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ప్రపంచ వైద్యుల దినోత్సవం సందర్భంగా

# రామచంద్రపురం ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుల సన్మానం



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** మానవ సేవే పరమావధిగా అహర్నిశలు శ్రమిస్తూ ప్రజల ప్రాణాలు కాపాడుతున్న వైద్యుల సేవలు వెలకట్టలేనివని రామచంద్రపురం కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త కోటా శ్రీనివాసరావు కొనియాడారు. ప్రపంచ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని కోటా శ్రీనివాసరావు అధ్యక్షతన, స్థానిక రామచంద్రపురం ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులందరికీ వారు అందిస్తున్న సేవలకు గానూ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కొత్తూరు శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ సమన్వయకర్త కోటా శ్రీనివాసరావు మాట్లాడుతూ సమాజంలో దేవుడి తర్వాత ప్రాణాలు నిలిపే ఉదాత్తమైన వృత్తి వైద్య వృత్తి అని నిరంతరం ఒత్తిడితో కూడిన విధులను నిర్వహిస్తూ ప్రజారోగ్య రక్షణలో వైద్యులు కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. కరోనా వంటి విపత్కర కాలంలో తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి వేలాది మందిని కాపాడిన వైద్యుల త్యాగాలు మరువలేనివన్నారు. రామచంద్రపురం నియోజకవర్గ పరిధిలోని పేద, మధ్యతరగతి ప్రజలకు కార్పొరేట్ స్థాయి ఉచిత వైద్యం అందాలన్నదే కాంగ్రెస్ పార్టీ ఆశయమని, అందుకోసం ఈ ప్రాంతీయ ఆసుపత్రిని అన్ని రకాలుగా మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆసుపత్రిలో మౌలిక వసతుల కల్పనతో పాటు, వైద్యులపై జరుగుతున్న దాడులను అరికట్టి వారికి పూర్తి రక్షణ కల్పించేందుకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. అనంతరం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కొత్తూరు శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరి జీవితంలో వైద్యుల పాత్ర ఎంతో కీలకమని, వారి సేవలను గుర్తించి గౌరవించడం అందరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ సన్మాన కార్యక్రమంపై రామచంద్రపురం ప్రాంతీయ ఆసుపత్రి వైద్యులు సంతోషాన్ని వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో నిరంతరం తీరికలేకుండా ఉండే తమ వద్దకు వచ్చి, సేవలను గుర్తించి అభినందించడం ఎంతో ప్రోత్సాహాన్ని, మానసిక ఉత్సాహాన్ని ఇస్తుందని వైద్యులు పేర్కొన్నారు. సత్కరించినందుకు కోటా శ్రీనివాసరావు, కొత్తూరు శ్రీనివాస్ మరియు కాంగ్రెస్ నాయకులకు వైద్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ సభ్యులు శ్రీమన్నారాయణ, ఆర్డీ ఖాన్, మెహతాబ్ ఖురేషి, జుట్టుక కమల్ కుమార్, కొప్పిశెట్టి రామకృష్ణ, దంగేటి నాగేశ్వరరావు, దొంగ ఉదయ్ కుమార్, శృంగవరపు స్వామి, ఆలీ మరియు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, ఆసుపత్రి సిబ్బంది భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# శ్రీ కామాక్షి పీఠం యువకుడి అదృశ్యంపై కేసు నమోదు



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** అమలాపురం శ్రీ కామాక్షి పీఠం ప్రేమ మందిరంలో ఆశ్రయం పొందుతున్న బాలుడు అదృశ్యం కావడంపై బుధవారం అమలాపురం పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.దత్తాత్రేయ (20) ఇది మూడోసారి అదృశ్యం అయినా తొలిసారి కేసు నమోదు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.శ్రీ కామాక్షి ప్రేమ మందిరంలో గత 17 ఏళ్లుగా కామాక్షి ప్రేమ మందిరం పేరు దత్తాత్రేయగా ఆశ్రయం పొందుతున్నాడు. అమలాపురం పట్టణ సీఐ పి.వీరబాబు, ఎస్సై శ్రీనివాస్,స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గత నెల 29వ తేదీ సాయంత్రం 6గంటలకు తన చేతికున్న వెండి ఉంగరం బాగు చేయించుకునేందుకు కామాక్షి శక్తి పీఠం నుంచి బయటకు వెళ్ళాడు. ఆ తరువాత తిరిగి ఆశ్రమానికి చేరుకోకపోవడంతో అన్నిచోట్ల గాలించారు.గతంలో దత్తాత్రేయ ఇదేవిధంగా రెండు పర్యాయాలు బయటకు వెళ్లి ఒకటి రెండు రోజుల తర్వాత తిరిగి వచ్చేవాడు. ఎంతకూ తిరిగి రాకపోవడంతో ఆశ్రమ నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.కామాక్షి శక్తి పీఠం చారిటబుల్ ట్రస్ట్ మేనేజర్ వక్కలంక వాణి ఇచ్చిన పిర్యాదుపై అమలాపురం పట్టణ ఎస్సై టి. శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రిజిస్ట్రేషన్ సేవల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా

# దస్తావేజు లేఖర్ల నిరసన




**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రిజిస్ట్రేషన్ సేవలను ప్రైవేటీకరించే నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని కోరుతూ అమలాపురం దస్తావేజు లేఖర్లు బుధవారం నిరసన చేపట్టారు. రాష్ట్ర దస్తావేజు లేఖర్ల సంఘం పిలుపు మేరకు స్థానిక నల్లవంతెన సమీపంలోని సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా లేఖర్లు మాట్లాడుతూ, తమ లైసెన్సులను పునరుద్ధరించాలని, రిజిస్ట్రేషన్ సేవలను ప్రైవేటీకరించే ప్రయత్నాలను విరమించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లను ప్రభుత్వం పట్టించుకోకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నిరసన కార్యక్రమంలో అమలాపురం దస్తావేజు లేఖర్ల సంఘం అధ్యక్షుడు జున్నూరి సురేష్, గౌరవ అధ్యక్షుడు గుంటు ఫణి ప్రసాద్, కార్యదర్శి పెద్దిరెడ్డి దుర్గేష్, ఉపాధ్యక్షుడు సుబ్బు, కన్వీనర్ మట్టపర్తి రాము, సభ్యులు పందిరి హరి, బోగిరాజు, బుట్టే, పృథ్వి శ్రీను, సుబ్బయ్య, రాజా, చిన్ని, మహేష్, కరుణతో పాటు సహాయకులు, టైపిస్టులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి నౌకాదళ సైనిక శిబిరానికి

# వీ.ఎస్.ఎం. కళాశాల విద్యార్థుల ఎంపిక



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురంలోని వీ.ఎస్.ఎం. కళాశాల (స్వయంప్రతిపత్తి)కి చెందిన ఇద్దరు విద్యార్థులు ప్రతిష్ఠాత్మక అఖిల భారత నౌకాదళ సైనిక శిబిరం–2026కు ఎంపికయ్యారు. ఈ కళాశాలకు చెందిన జాతీయ సైనిక విద్యార్థి దళం నౌకాదళ విభాగానికి చెందిన విద్యార్థులు కె.వి.పి. సంతోష్, డి.పి.ఏ.వి. సురేఖ ఈ జాతీయ స్థాయి శిబిరంలో పాల్గొనే అరుదైన అవకాశాన్ని దక్కించుకున్నారు. ఈ ప్రతిష్ఠాత్మక శిబిరం మహారాష్ట్రలోని లోనావాలాలో గల నౌకాదళ కేంద్రం 'శివాజీ' వేదికగా జరగనుంది. దేశవ్యాప్తంగా ఎంపికైన అత్యుత్తమ నౌకాదళ విద్యార్థులు ఈ శిబిరంలో పాల్గొంటారు. ఇందులో భాగంగా వీరు నౌకాదళ సంబంధిత శిక్షణ, నాయకత్వ లక్షణాలు నేర్చుకోవడంతో పాటు వివిధ పోటీలు, జాతీయ సమైక్యత కార్యక్రమాల్లో పాలుపంచుకోనున్నారు. జాతీయ స్థాయి శిబిరానికి ఎంపికైన ఈ ఇద్దరు విద్యార్థులను కళాశాల ఉపాధ్యక్షులు ఎం.ఎస్.ఎన్. మూర్తి, ప్రధానాచార్యులు డాక్టర్ అలీ అన్సారీ, ఇతర అధ్యాపకులు, అధికారుల బృందం అభినందించారు. విద్యార్థులు తమ ప్రతిభతో వీ.ఎస్.ఎం. కళాశాలకు, కాకినాడ ఆరవ నౌకాదళ విభాగానికి, అలాగే ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాల నిర్దేశక కార్యాలయానికి మంచి పేరు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు.

కమీషనర్ ఆఫ్ కాలేజీయేట్ ఎడ్యుకేషన్‌ని

# మర్యాదపూర్వకంగా కలిసిన మోడరన్ అధినేత జి.వి.రావు



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** మోడరన్ విద్యాసంస్థల అధినేత లయన్ డాక్టర్ జి.వి.రావు బుధవారం మంగళగిరిలో కమిషనర్ ఆఫ్ కాలేజీయట్ ఎడ్యుకేషన్ డాక్టర్ నారాయణ భరత్ గుప్తాని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గత 48 సంవత్సరాలుగా మోడరన్ విద్యాసంస్థల ప్రస్థానాన్ని జి.వి.రావు ఆయనకు వివరించారు. సుమారు లక్ష మంది విద్యార్థులను మోడరన్ విద్యాసంస్థలు తీర్చిదిద్దిన వైనాన్ని డాక్టర్ భరత్ గుప్త ప్రత్యేకంగా అభినందించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులలో దాగివున్న ప్రతిభను వెలికి తీయటంలో జి.వి రావు చేస్తున్న కృషి అభినందనీయమని ఆయన కొనియాడారు. సమయానుకూలాన్ని అనుసరించి తాను మోడరన్ విద్యాసంస్థలకు వస్తానని డాక్టర్ భరత్ గుప్తా పేర్కొన్నట్లు రావు ఈ సందర్భంగా తెలిపారు. అనంతరం మోడరన్ విద్యాసంస్థలకు సంబంధించిన మ్యాగజైన్‌ని రావు ఆయనకు అందజేసారు.

# అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ పెన్షన్లు

## ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ పెన్షన్లు అందిస్తున్నామని అమలాపురం మీూా అయితాబత్తుల ఆనందరావు పేర్కొన్నారు. వానపల్లిపాలెంలో బుధవారం ఆయన లబ్ధిదారుల ఇళ్లకు స్వయంగా వెళ్లి ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు అందజేశారు. ఎన్నికల్లో ఇచ్చిన మొదటి వాగ్దానమైన పెన్షన్ల పెంపును తూచా తప్పకుండా అమలు చేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కిందని, ఈ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

రామచంద్రపురం భాష్యం పాఠశాలలో

# ఘనంగా జాతీయ వైద్యుల దినోత్సవం



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురంలోని స్థానిక భాష్యం పాఠశాలలో జాతీయ వైద్యుల దినోత్సవ వేడుకలను ప్రిన్సిపాల్ పి.భాస్కరరావు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పట్టణ ప్రముఖ దంత వైద్యులు, విజయ దంత వైద్యాశాల వైద్యుడు డాక్టర్ ఎం. అమృతరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులకు దంత ధావన ఆవశ్యకతను, పళ్లు తోముకునే సరైన విధానాన్ని వివరించారు. శీతల పానీయాలు, స్వీట్లు, జంక్ ఫుడ్స్ తినడం వల్ల, అలాగే సరిగ్గా బ్రష్ చేసుకోకపోవడం వల్ల దంతాలు పాడవుతాయని అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించి తగిన సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పాఠశాల జోనల్ ప్రిన్సిపాల్ వల్లూరి గోవిందరాజు మాట్లాడుతూ, వైద్యులు తమ వ్యక్తిగత ఆనందాలను వదులుకుని సమయంతో సంబంధం లేకుండా ప్రజల ఆరోగ్యం కోసం అహర్నిశలు శ్రమిస్తున్నారని అన్నారు. కోవిడ్ కష్టకాలంలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా వైద్యులు అందించిన సేవలు మరువలేనివని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఛాంప్స్ ప్రిన్సిపాల్ పి.శాంతి, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# బ్లేడుతో ఇద్దరి పిల్లల గొంతు కోసి హత్య

## అనంతరం తల్లి ఆత్మహత్యాయత్నం

**ఆమదాలవలస గ్రామీణం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆ తల్లికి ఏం కష్టమొచ్చిందో..! తాను లేని లోకంలో పిల్లల బాగోగులు ఎవరూ చూడరనుకుందో లేక క్షణికావేశంలో ఏమనుకుందో కానీ, ఆ కన్నపేగు.. కడుపున పుట్టిన ఇద్దరు చిన్నారుల గొంతును బ్లేడుతో కోసి హత్య చేసింది. తర్వాత తానూ అదే బ్లేడుతో కోసుకుని ఆత్మహత్యకు యత్నించి, మృత్యువుతో పోరాడుతోంది. శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస మండలం వెదుళ్లవలస గ్రామంలో జరిగిన ఈ విషాద ఘటనపై పోలీసులు, కుటుంబ సభ్యులు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కూర్మాపు వరలక్ష్మి(30), తన పెద్ద కుమార్తె భవానీ(4), చిన్న కుమార్తె చాందిని(మూడు నెలలు)తో కలిసి సోమవారం రాత్రి ఇంట్లో నిద్రించారు. ఆమె అత్త.. ఇంటి బయట నిద్రపోయారు. మంగళవారం తెల్లవారు లేచి చూసేసరికి పిల్లలిద్దరూ రక్తపు మడుగులో మృతి చెంది ఉన్నారు. వరలక్ష్మి కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతుండటంతో వెంటనే శ్రీకాకుళం సర్వజనాసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. వరలక్ష్మి భర్త రమణ నల్గొండలో ఓ ప్రైవేట్ కంపెనీలో పని చేస్తున్నారు. అత్తింటి వేధింపులే కారణమని వరలక్ష్మి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఆమదాలవలస ఎస్సై బాలరాజు తెలిపారు.

ద్రాక్షారామం అగ్నిప్రమాద బాధిత వ్యాపారులకు

# తూకం మిషన్ల పంపిణీ

## పునర్నిర్మాణ పనులు శరవేగంగా.. త్వరలోనే నూతన మార్కెట్ ప్రారంభం



**ద్రాక్షారామం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఇటీవల ద్రాక్షారామం మార్కెట్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో దుకాణాలను కోల్పోయిన చిరు వ్యాపారులకు మంత్రి వాసంశెట్టి సుభాష్, అండగా నిలిచారు. అగ్నిప్రమాదంలో నష్టపోయిన వ్యాపారులు తిరిగి తమ జీవనోపాధిని ప్రారంభించేలా అవసరమైన కాటాలు (తూకం వేసే మిషన్లు) కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, రామచంద్రపురం ఆర్డీవో సరళావతి, ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, ఎంపీడీవో పద్మజ్యోతి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఇటీవల సంభవించిన అగ్నిప్రమాదంలో 48 దుకాణాలు పూర్తిగా అగ్నికి ఆహుతి కాగా, బాధిత వ్యాపారులను ఆదుకునేందుకు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ చొరవతో నూతన మార్కెట్ నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. నిర్మాణ పనులను పరిశీలించిన అనంతరం నాయకులు బాధితులకు తూకం మిషన్లను అందజేసి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ అగ్నిప్రమాదంతో ఉపాధిని కోల్పోయిన వ్యాపారులను అన్ని విధాలుగా ఆదుకోవడం కూటమి ప్రభుత్వ బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. మంత్రి వాసంశెట్టి సుభాష్ ఇచ్చిన హామీ మేరకు పది రోజుల్లోగా నూతన మార్కెట్ నిర్మాణాన్ని పూర్తి చేసి వ్యాపారులకు అందుబాటులోకి తీసుకువస్తామని మరోసారి స్పష్టం చేశారు. ఆర్డీవో సరళవతి మాట్లాడుతూ మంత్రి వాసంశెట్టి సుభాష్, వాసంశెట్టి సత్యం ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ మార్కెట్ పునర్నిర్మాణ పనులు వేగంగా జరుగుతుండటంపై ఆనందం వ్యక్తం చేశారు. బాధిత చిరు వ్యాపారులు తక్కువ సమయంలోనే తమ వ్యాపారాలు ప్రారంభించుకునేలా తీసుకున్న చొరవ అభినందనీయమన్నారు. కష్టకాలంలో తమకు అండగా నిలిచి, తిరిగి వ్యాపారం ప్రారంభించేందుకు అవసరమైన సామగ్రిని అందించడంతో పాటు నూతన మార్కెట్‌ను నిర్మించి ఇస్తున్నందుకు మంత్రి వాసంశెట్టి సుభాష్, వాసంశెట్టి సత్యం సహా కూటమి నాయకత్వానికి వ్యాపారులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ పెంకే అన్నపూర్ణ సాంబశివరావు, ద్రాక్షారామం మాజీ సర్పంచ్ కొత్తపల్లి అరుణ, కంచుమర్తి బాబురావు, వయిట్ల గజలక్ష్మి, కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు, మార్కెట్ వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు బాగా చదివి

# షైనింగ్ స్టార్స్‌గా నిలవాలి

## కమరున్నీస పలువురు అభినందనలు



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమహేంద్రవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థిని కమరున్నిస షైనింగ్ స్టార్ అవార్డును విద్యా శాఖ మంత్రి నారాలోకేష్ చేతుల మీదుగా అందుకుంది. ఈ సందర్భంగా ఇంటర్మీడియట్ జాయింట్ రీజినల్ డైరెక్టర్ టి.శేఖర్ బాబు, డి.వి.ఈ.ఓ.డి. విజయశ్రీ, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డా. పి. త్రినాథ్ రాజా కమరున్నిస ను అభినందించారు. ఈ సందర్భంగా రీజినల్ జాయింట్ డైరెక్టర్ టి. శేఖర్ బాబు మాట్లాడుతూ విద్యార్థులు అంతా బాగా చదువుకొని షైనింగ్ స్టార్స్ గా నిలవాలని విద్యార్థులను కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డి.గోపినాథ్, డి.శివకుమార్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# రాయవరం పాఠశాలను సందర్శించిన డీవైఈఓ

## విద్యార్థుల సామర్థ్యాల పరిశీలన



**రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా, మండల కేంద్రమైన రాయవరం ఇందిరా కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నెం.1ను డివిజనల్ విద్యాశాఖ అధికారి (డీవైఈఓ) పి.రామ లక్ష్మణమూర్తి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల నిర్వహణ, విద్యాబోధన విధానాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మమేకమై వారి అభ్యసన సామర్థ్యాలను పరీక్షించారు. విద్యార్థుల చదువు స్థాయి, విషయ అవగాహనపై వివరాలు తెలుసుకున్నారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలు తీరుపై చిన్నారుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులలో విద్యా ప్రమాణాలు పెంపొందించే దిశగా ప్రత్యేక శ్రద్ధ వహించాలని, బోధనలో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయ్ కుమార్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# వైద్యం..విద్య...శాంతిభద్రతలకే కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత

**ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ – 90 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రతి నియోజకవర్గ అభివృద్ధికి వైద్యం, విద్య, శాంతిభద్రతలు అనే మూడు అంశాలు అత్యంత కీలకమని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ మూడు రంగాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగుతోందని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. ప్రియాంక గార్డెన్స్ ఎదురుగా ఉన్న లీలా ఫెవెలియన్ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన కూటమి నాయకులతో కలిసి మాట్లాడారు. సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.5.69 కోట్ల సాయం ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) అత్యంత గొప్ప సంక్షేమ కార్యక్రమమని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఒక్క సీఎంఆర్ఎఫ్ చెక్కు కూడా ఇవ్వలేదని ఆరోపించారు. 2019 నాటికి పెండింగ్‌లో ఉన్న 23 దరఖాస్తులను కూడా పట్టించుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పార్టీలు, రాజకీయాలు చూడకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సహాయం అందిస్తున్నామని చెప్పారు. ఇప్పటి వరకు రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గంలో మొత్తం 686 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ సహాయం అందిందన్నారు. మొత్తం సహాయం రూ.5,69,91,934 అని వెల్లడించారు. అంతకుముందు 596 చెక్కుల ద్వారా రూ.5,07,81,071 పంపిణీ చేశామని తెలిపారు. ఈ రోజు 87 చెక్కులు, 3 ఎల్ఓసీలు కలిపి రూ.62,10,863 విలువైన సహాయం అందజేశామని చెప్పారు.

**విద్యారంగానికి అత్యధిక ప్రాధాన్యత:**

ఒక తరం భవిష్యత్తును తీర్చిదిద్దేది విద్య మాత్రమేనన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్యా సంస్కరణలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని కొనియాడారు. గతంలో ప్రతి పథకానికి రాజకీయ నాయకుల పేర్లు పెట్టారని, ప్రస్తుతం సర్వేపల్లి రాధాకృష్ణ పేరుతో విద్యార్థుల కిట్లు, డొక్కా సీతమ్మ పేరుతో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయడం ద్వారా కూటమి ప్రభుత్వం గొప్ప ఆలోచనను ప్రతిబింబించిందన్నారు.

**శాంతిభద్రతలపై రాజీ లేదు:**

ప్రజల భద్రతే ప్రభుత్వ బాధ్యత అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడే బ్లేడ్ బ్యాచ్, గంజాయి బ్యాచ్ ఆగడాలను అరికడతామని చెప్పామని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత 120 మందికి పైగా రౌడీషీట్లు తెరిచామని, 21 మందిపై పీడీ యాక్టు నమోదు చేశామని, గంజాయి వ్యాపారులపై ఎన్డీపీఎస్ చట్టం కింద కేసులు నమోదు చేస్తున్నామని, సారా మాఫియాపై ఉక్కుపాదంతో వ్యవహరిస్తున్నామని తెలిపారు.

**వైసీపీ నేతల ఆడియోపై స్పందన**

ఇటీవల వెలుగులోకి వచ్చిన ఫోన్ సంభాషణలో హత్యలు, తలలు నరికేస్తామంటూ మాట్లాడటం అత్యంత దురదృష్టకరమని ఎమ్మెల్యే అన్నారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమన్నారు. అధికార పార్టీలో ఉన్నా, కూటమి పార్టీలకు చెందిన వారైనా చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలే ఎవరు అధికారంలో ఉండాలో నిర్ణయిస్తారని, బెదిరింపులు, హింసా రాజకీయాలకు ప్రజలు తగిన సమాధానం చెబుతారని వ్యాఖ్యానించారు.

**యాసిడ్ పురుగుపై భయపడొద్దు:**

యాసిడ్ పురుగు విషయంలో ప్రజలు అవసరానికి మించి భయపడవద్దని ఎమ్మెల్యే సూచించారు. తనకు గతంలో ఈ పురుగుతో అనుభవం ఉందని చెబుతూ, దానిని నలిపితే మాత్రమే ద్రవం విడుదలై చర్మంపై మంట కలుగుతుందని, నలపకుండా దులిపేస్తే ఎలాంటి ప్రమాదం ఉండదన్నారు. అవసరమైతే వైద్యులను సంప్రదించాలని సూచించారు. అనంతరం 90 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. మీడియా సమావేశంలో కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**వైద్యాధికారి డివి చలపతిరావు వివరణ:**

అనంతరం మాట్లాడిన వైద్యాధికారి డివి చలపతిరావు యాసిడ్ పురుగు (రోవ్ బీటిల్) గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ పురుగు ప్రపంచంలోని అనేక దేశాల్లో ఉంటుందని, పంటలకు హాని చేసే చీడపీడలను తినే పర్యావరణహిత జీవి అని తెలిపారు. ఇది మనిషిని కుట్టదని, అయితే దానిని చేతితో నలిపితే విడుదలయ్యే టాక్సిన్ చర్మంపై పడితే 24 నుంచి 36 గంటల్లో మంట, దురద, నీటి బుడగలు వచ్చే అవకాశం ఉంటుందని వివరించారు. అలాంటి పరిస్థితిలో వెంటనే సబ్బు నీటితో కడుక్కోవాలని, చల్లటి కాపడం పెట్టుకోవాలని, అవసరమైతే కాలమైన్ లోషన్, స్టెరాయిడ్ ఆయింట్‌మెంట్ లేదా వైద్యుల సూచన మేరకు మందులు వాడాలని సూచించారు. కంటిలోకి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఎక్కువ వెలుతురు ఉన్న ప్రదేశాల్లో కొంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరమైన మందులన్నీ అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. చివరగా ప్రజలు ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని, సరైన జాగ్రత్తలు పాటిస్తే ఎలాంటి ప్రమాదం ఉండదని వైద్యాధికారి స్పష్టం చేశారు.

గ్రామసభలలోనే నూతన గృహాలకు

# లబ్ధిదారులు ఎంపిక : రమణ

**పలు సమస్యలపై వినతులు స్వీకరణ**



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రభుత్వ ఆదేశాలతో నిర్వహిస్తున్న గ్రామసభల ద్వారానే నూతనగృహాల నిర్మాణానికి లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందని గృహ నిర్మాణశాఖ ఏఈ రమణ తెలిపారు. బుధవారం కోరుకొండ మండలంలో ప్రత్యేక అధికారులు, సెక్రటరీల ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించారు. గ్రామసభల్లో వ్యక్తిగత పింఛన్లు, త్రాగునీరు, డ్రైన్ల నిర్మాణం, వీధి దీపాలు, పారిశుధ్యం, డ్రైన్ల పూడికతీతలు తదితర సమస్యలపై ప్రజలు సెక్రటరీలకు వినతి పత్రాలు అందించారు. ఈ సందర్భంగా గృహ నిర్మాణశాఖ మండలఅధికారి రమణ మాట్లాడుతూ కోరుకొండ మండలంలో గృహాలు నిర్మించుకునే వారు సచివాలయం ఆన్లైన్ ద్వారా1,575గృహాల మంజూరుకు దరఖాస్తు చేసుకున్నారన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామసభల ద్వారానే ప్రజల సమక్షంలో నూతన గృహనిర్మాణనికి లబ్ధిదారులు ఎంపిక జరుగుతుందన్నారు. గతంలో గృహాలు నిర్మించుకున్న వారికి నగదు చెల్లింపుల విషయంలో ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. సెక్రెటరీ నాగరత్నం మాట్లాడుతూ గ్రామానికి సంబంధించి ప్రజలు ఏ సమస్యను తమ దృష్టికి తీసుకువస్తున్న వెంటనే పరిష్కరిస్తున్నా మన్నారు. ఇంకా ఏవైనా సమస్యలు ఉంటే గ్రామసభల ద్వారా ఉన్నతాధికాకారులకు తెలియజేసి పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గృహనిర్మాణశాఖ ఏఈ రమణ, సెక్రెటరీ నాగరత్నం, జనసేన పార్టీ నాయకులు బదిరెడ్డి దొర, జి శ్రీధర్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

-సర్ పేరుతో గ్రామసభలకు డుమ్మా: మండలంలో అన్ని గ్రామాలలో నిర్వహించిన గ్రామసభలకు "సర్ పేరు"తో కొన్ని శాఖలకు సంబంధించిన అధికారులు పలుచోట్ల గ్రామసభలకు డుమ్మా కొట్టారు.

# ఘనంగా రెడ్డి రాధాకృష్ణ పుట్టిన రోజు వేడుకలు



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, రాష్ట్ర వైసిపి కిసాన్ సెల్ కన్వీనర్, పురపాలక సంఘం మాజీ కో ఆప్షన్ సభ్యులు రెడ్డి రాధాకృష్ణ రాజబాబు పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండపేట విజయలక్ష్మి నగర్‌లోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఈ వేడుకలు నిర్వహించారు. రాజబాబు ను పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు శుభాకాంక్షలు తెలిపారు. దుశ్శలువా తో రెడ్డి రాధాకృష్ణ ను సత్కరించారు. కేక్ కట్ చేసి అభిమానులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైసిపి ఉపాధ్యక్షులు పిల్లా వీరబాబు, జిల్లా యువజన విభాగ కార్యదర్శి కోణాల చంద్రబోస్, జిల్లా వైసిపి ప్రధాన కార్యదర్శి ఎర్రగుంట మణికంఠ, టౌన్ వైసిపి సోషల్ మీడియా ప్రెసిడెంట్ వీరి కిరణ్ కుమార్, రాష్ట్ర వైయస్సార్ టీ యు సి కార్యదర్శి శెట్టి నాగేశ్వరరావు, ఉద్యోగుల పెన్షనర్ రాష్ట్ర కార్యదర్శి టపా పుల్లేశ్వరరావు, తణుకు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# మండపేటకు చెందిన విద్యార్థి అశ్వక్‌కు ఏంసెట్‌లో 310 ర్యాంక్

**ముస్లిం కుటుంబంలో వికసించిన విద్యా కుసుమం**



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** మండపేట పట్టణంలో మధ్యతరగతి ముస్లిం కుటుంబానికి చెందిన విద్యార్థి ఏంసెట్‌లో 310 ర్యాంక్ సాధించి వికసించాడు. మండపేట రావుల పేటకు చెందిన షేక్ మీరా సాహెబ్(సర్కార్), షేక్ ఆయేషా బేగం దంపతుల కుమారుడు షేక్ అహ్మద్ అశ్వక్ ఏం సెట్ లో 310 ర్యాంక్ సాధించాడు. ఈ విద్యార్థి ఎనిమిదవ తరగతి వరకు మండపేట అన్నపూర్ణ లో చదివాడు. పదవ తరగతి , ఇంటర్ రామచంద్రాపురం మోడ్రన్ లో చదివాడు. గత ఏడాది ఏం సెట్ లో 9వేలు ర్యాంక్ వచ్చింది. నిరాశ చెందకుండా ఏడాది పాటు మండపేట లో తమ ఇంట్లో ఉండి ఏం సెట్ కు సిద్ధమయ్యాడు. ఈ ఏడాది ఈ అత్యుత్తమ ర్యాంకు సాధించాడు. విద్యార్థి తండ్రి సర్కార్ సాధారణ వ్యక్తి. కష్టపడి ఇంట్లో ఉండి శ్రద్ధగా శిక్షణ తీసుకొని ఈ ఘనత సాధించాడు. విద్యార్థి అశ్వక్ ను పలువురు అభినందించారు.

# ఆటో కార్మికుడికి కుడుపూడి సత్తిబాబు ఆర్థిక చేయూత



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** శ్రీవిజయ గోదావరి ఆటో యూనియన్‌కు చెందిన ఆటో డ్రైవర్ డి.దుర్గా మణికుమార్ ఇటీవల కిడ్నీ సంబంధిత శస్త్రచికిత్స చేయించుకుని, వైద్యుల సూచన మేరకు ఇంటి వద్దే పూర్తి విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలుసుకున్న రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు దుర్గా మణి కుమార్ కుటుంబం ప్రస్తుతం ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఆటో యూనియన్ నాయకులతో కలిసి ఆయన నివాసానికి వెళ్లి రూ.5,000 నగదు ఆర్థిక సహాయంతో పాటు బియ్యం, కిరాణా తదితర నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా కుడుపూడి సత్తిబాబు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వ పాలనలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రజా సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్న నేపథ్యంలో, అదే సేవా స్ఫూర్తితో ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నారు. అవసరమైన సమయంలో తోటి మనిషికి చేయూత అందించడం గొప్ప సేవ అని పేర్కొన్నారు. దుర్గామణికుమార్ త్వరగా కోలుకుని తిరిగి సాధారణ జీవితంలోకి రావాలని ఆకాంక్షించారు. ఈ సహాయానికి దుర్గామణికుమార్ కుటుంబ సభ్యులు కుడుపూడి సత్తిబాబు గారికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ ప్రెసిడెంట్ మూపనబోయిన వీరబాబు, వైస్ ప్రెసిడెంట్ సూరప్ప రెడ్డి, సెక్రటరీ అరుగుల చంటి మరియు ఆటో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# జూలై 7న జిల్లా కలెక్టరేట్ ధర్నా

**ఫీజు రీయంబర్స్మెంట్ బకాయిలు విడుదల చేయాలి – ఎస్ఎఫ్ఐ పోస్టర్ ఆవిష్కరణ**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** జూలై 7వ తేదీన బొమ్మూరు జిల్లా కలెక్టరేట్ వద్ద జరగబోయే ధర్నాను జయప్రదం చేయాలని చలో కలెక్టరేట్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్.ఎఫ్.ఐ తూర్పు గోదావరి జిల్లా నాయకులు ఫీజురీయంబర్స్మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని, హాస్టల్ విద్యార్థులకు మెస్ బిల్లులు రూ. 3 వేలకు పెంచాలని, ఎఫ్.ఆర్.ఎస్ ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 7 వ తేదీన కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని ఎస్.ఎఫ్.ఐ తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు వై. భాస్కర్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వై. భాస్కర్ మాట్లాడుతూ గత ప్రభుత్వం ఫీజు బకాయిలు చెల్లించలేదని, ఫీజులను సకాలంలో చెల్లించి సక్రమంగా విద్యార్థుల చదువు కొనసాగిస్తామని హామీ ఇచ్చిన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఇప్పుడు ఆ ఊసే ఎత్తడం లేదని అన్నారు. పెండింగులో 7 వేల కోట్లకు పైగా ఫీజు రీయంబర్స్మెంట్ బకాయిలు ఉన్నాయని దీంతో ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాల యాజమాన్యాలు సైతం ఫీజు కడితేనే పరీక్ష హాల్ టికెట్స్ ఇస్తాము అని బెదిరించి విద్యార్థులచేత బలవంతంగా కట్టించుకుంటున్న పరిస్థితి ఉందని అన్నారు. కావున తక్షణమే ఫీజు రీయంబర్స్మెంట్ బకాయిలు విడుదల చేయాలని, గత కొన్ని ఏళ్లుగా హాస్టల్ విద్యార్థులకు మెస్ చార్జీలు పెంచలేదని, హాస్టల్ విద్యార్థుల సమస్యలు గాలికి వదిలేస్తున్నారని అన్నారు. హాస్టల్ విద్యార్థుల మెస్ బిల్లులు 3 వేలకు పెంచాలని అన్నారు. అలాగే అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే జీవో నెం. 77 రద్దు చేస్తామని చెప్పి దాని ఊసే ఎత్తడం లేదని అన్నారు. తక్షణమే జీవో నెం. 77 రద్దు చేసి పీజీ చదివే విద్యార్థులకు ఫీజురీయంబేర్స్మెంట్ అమలు చేయాలని అన్నారు. జులై 7వ తేదీన బొమ్మూరు కలెక్టరేట్ వద్ద పెద్ద ఎత్తున జరిగే ధర్నాలో విద్యార్థులు పాల్గొని జయప్రదం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఎఫ్.ఐ జిల్లా కమిటీ సభ్యులు కె. జ్యోతి, జి. కార్తిక్, టి. సౌమ్య ఎస్.ఎఫ్.ఐ నాయకులు తరుణ్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# న్యాయవాదులపై దాడులు అరికట్టాలి..

**కేంద్రం న్యాయవాదులకు రక్షణ చట్టం అమలు చేయాలి - న్యాయవాదులకు సంక్షేమ నిధి ఏర్పాటు చేయాలి**
**జూనియర్ న్యాయవాదులకు గౌరవ వేతనం మంజూరు చేయాలి - కుటుంబాలకు ఉచిత బీమా సౌకర్యం కల్పించాలి**
**సీఎం చంద్రబాబుకు పోస్ట్ కార్డులు పంపిన న్యాయవాదులు - న్యాయవాదుల జేఏసీ నేత పివివిఎస్‌బి రాజు డిమాండ్**





**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఇటీవల కాలంలో దేశంలోనూ, రాష్ట్రంలోనూ న్యాయవాదులపై దాడులు ఎక్కువైపోయాయని వాటిని అరికట్టాలని కోరుతూ న్యాయవాదుల జేఏసీ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. బుధవారం రాజమహేంద్రవరం జిల్లా కోర్టు మెయిన్ గేటు వద్ద న్యాయవాదుల జేఏసీ ఆధ్వర్యంలో న్యాయవాదుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పలు డిమాండ్లతో ఆందోళన జరిగింది. ఈ సందర్భంగా న్యాయవాదుల జేఏసీ నాయకులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ మాజీ కన్వీనర్ పి వి వి ఎస్ బి రాజు విలేకరులతో మాట్లాడుతూ, న్యాయవాదులకు రక్షణ చట్టం అమలు చేయాలని కోరారు. ఇటీవల కాలంలో రాష్ట్రంలో న్యాయవాదులపై అనేక దాడులు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఏలూరులో న్యాయవాది ఈడుపుగంటి శ్రీనివాసరావు ఇంటిని ప్రొక్లెయిన్ తో కూల్చివేస్తామని ఒక రాజకీయ నాయకుడు బెదిరింపులకు పాల్పడి, దాడి చేశాడని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే తణుకులో ఒక న్యాయవాది పై దాడులకు పాల్పడ్డారని వివరించారు. ఇటువంటి దాడులు ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు వంటిదని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి న్యాయవాదులకు రక్షణ చట్టం కల్పిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేశారని అన్నారు. న్యాయవాదులకు ఉచిత భీమా సౌకర్యం కల్పించారని తెలిపారు. అలాగే ఆంధ్రప్రదేశ్ లో కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వచ్చి వర్షాకాల అసెంబ్లీ సమావేశాలలో న్యాయవాదులకు ప్రత్యేక రక్షణ చట్టం కల్పిస్తూ తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. న్యాయవాదులకు రూ 100 కోట్లతో సంక్షేమ నిధి ఏర్పాటు చేయాలని కోరారు. జూనియర్ న్యాయవాదులకు రూ 5 వేల స్టైఫండ్ మంజూరు చేయాలని కోరారు. న్యాయవాదులకు, వారి కుటుంబాలకు రూ 25 లక్షలు ఉచిత బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా న్యాయవాదులు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తమ సమస్యలు తెలుపుతూ పోస్ట్ కార్డులు పంపించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదుల జేఏసీ నాయకులు డివివి త్రినాథ్, గుళ్ళ ఏడుకొండలు, అల్లంపల్లి రామకృష్ణ, పి. వీర్రాజు, టీ. ప్రకాష్ రావు, ధర్మ బీరా అరుణ కుమారి, బి. మెర్సికుమారి, పి. విక్టోరియా, సతీష్ చంద్ర, మాగాపు పద్మ, ధర్నాలకోట వెంకటేశ్వరరావు, ఎస్. ప్రవీణ్ కుమార్, హసన్ తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక పెన్షన్లు అందజేసిన కుడుపూడి సత్తిబాబు



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ప్రతినెలా ఒకటో తేదీన అర్హులైన లబ్ధిదారుల ఇంటి వద్దకే 'ఎన్టీఆర్ భరోసా' పింఛన్లను అందజేస్తోందని రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు అన్నారు. బుధవారం ఉదయం నుండి రాజమహేంద్రవరం నగరంలోని మూడవ వార్డు పరిధిలో లబ్ధిదారుల ఇళ్లకు స్వయంగా వెళ్లి వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో కొండపల్లి శ్రీదేవి, అహ్మదునిషా, కుడుపూడి సరోజిని, నాగమణి, సాయి లక్ష్మి, యెర్రా ఝాన్సీ , స్థానిక సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# క్రీడల్లో ప్రతిభ చూపుతున్న విద్యార్థులకు ప్రోత్సాహకం

**ఆటల పోటీలకు వెళ్తున్న నవ్యకు కుడుపూడి సత్తిబాబు ఆర్థిక సహాయం**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమహేంద్రవరం నుంచి రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక కావడం నగరానికి గర్వకారణమని రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు అన్నారు. క్రీడల్లో ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థులను ప్రోత్సహించడం అందరి బాధ్యత అని పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొనేందుకు నంద్యాల వెళ్లనున్న రాజమహేంద్రవరం విద్యార్థిని కుమారి రాజన్న నవ్యకు ప్రయాణం మరియు ఇతర ఖర్చుల నిమిత్తం తన వంతు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నవ్యకు అభినందనలు తెలియజేస్తూ, రాష్ట్రస్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి విజేతగా నిలిచి రాజమహేంద్రవరం నగరానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.


విశ్వం వాయిస్
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY
సువర్ణావకాశం
₹99/- లకే మీ ప్రకటన!
స్థానిక వ్యాపారాన్ని పదిమందికి పరిచయం చేయండి! అత్యంత తక్కువ ధరకే క్లాసిఫైడ్స్.
ఇల్లు అమ్మకాలు / అద్దెలు
వాహనాల అమ్మకం
ట్యూషన్ & & విద్య
ఉద్యోగ అవకాశాలు
సర్వీసు& రిపేర్లు
ఇతర ప్రకటనలు
ఎందుకు విశ్వం వాయిస్?
అత్యంత తక్కువ ధర (₹99 మాత్రమే)
కాకినాడ పరిధిలో విస్తృత ప్రచారం
సోషల్ మీడియాలోనూ ఉచిత ప్రమోషన్
ఇప్పుడే సంప్రదించండి: 9246033999, 7579339999 9246033999 కాకినాడ కార్యాలయం

# టాక్సిక్ నుంచి పవర్ ఫుల్ లేడీస్..



కేజీఎఫ్ సినిమాతో ఒక్కసారిగా పాన్ ఇండియాను షేక్ చేశాడు హీరో యష్. ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో తెరకెక్కిన కేజీఎఫ్ సినిమా విడుదలైన అన్ని భాషల్లో మంచి విజయాన్ని అందుకుంది. ఈ సినిమాతో తెలుగులోనూ ఎంతో మంది అభిమానులను సొంతం చేసుకున్నాడు యష్. రాకింగ్ స్టార్ యశ్ హీరోగా గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'టాక్సిక్: ఎ ఫెయిరీటేల్ ఫర్ గ్రోన్-అప్స్'పై రోజురోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి. తాజాగా మేకర్స్ 'లేడీస్& లేడీస్' పేరుతో ఓ పవర్‌ఫుల్ ప్రమోషనల్ వీడియోను విడుదల చేసి సినిమాపై మరింత ఆసక్తిని పెంచారు. ఈ వీడియోలో టాక్సిక్ ప్రపంచాన్ని శాసించే మహిళా పాత్రలను పరిచయం చేస్తూ, కథలో వారి ప్రాధాన్యతను చూపించారు. నయనతార, కియారా అద్వానీ, తారా సుతారియా, రుక్మిణి వసంత్, హుమా ఖురేషీ ఒక్కో ఫ్రేమ్‌లో తమ పవర్‌ఫుల్ స్క్రీన్ ప్రెజెన్స్‌తో ఆకట్టుకున్నారు. నయనతార పవర్ ఫుల్ పాత్రలో కనిపించగా, కియారా అద్వానీ మిస్టీరియస్, ఎమోషనల్ షేడ్స్‌తో మెస్మరైజ్ చేసింది. తారా సుతారియా తన స్టైలిష్ అటిట్యూడ్‌తో మెప్పించగా, రుక్మిణి వసంత్ ఇనేత్స్ను కూడిన పాత్రలో కనిపించింది. హుమా ఖురేషీ కూడా తన డాషింగ్ లుక్‌తో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మహిళ కోణంలో సాగే పవర్‌ఫుల్ వాయిస్ ఓవర్ వీడియోకు మరింత మిస్టరీని జోడించింది. వీడియో ప్రారంభంలోనే "పిల్లలు... దూరంగా ఉండండి. తల్లిదండ్రులు... మీ పిల్లలను దూరంగా ఉంచండి. తాతలు, బామ్మలు... మీ మనవళ్లను కూడా దూరంగా ఉంచండి. ముత్తాతలు... మీ సొంత రిస్క్‌పై చూడండి" అనే డిస్క్లైమర్‌తో సినిమాకు ఉన్న బోల్డ్ టోన్‌ను ఆసక్తికరంగా పరిచయం చేశారు. స్టైలిష్ విజువల్స్, పవర్‌ఫుల్ యాక్షన్, మిస్టరీతో 'టాక్సిక్' మరోసారి ప్రేక్షకుల్లో క్యూరియాసిటీని పెంచింది. యాక్షన్‌తో పాటు బలమైన మహిళా పాత్రలకు కూడా సమాన ప్రాధాన్యత ఉంటుందని ఈ వీడియో స్పష్టం చేసింది. గీతూ మోహన్‌దాస్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో యశ్ హీరోగా, నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. నయనతార, కియారా అద్వానీ, తారా సుతారియా, రుక్మిణి వసంత్, హుమా ఖురేషీ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. కన్నడ, ఇంగ్లీష్ భాషల్లో ఏకకాలంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని హిందీ, తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో కూడా విడుదల చేయనున్నారు. కేవీఎన్ ప్రొడక్షన్స్, మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం 2026 ఆగస్టు 26న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది.

తొమ్మిది సినిమాలు.. 5 హిట్లు..!

# టాలీవుడ్‌లో దుమ్మురేపుతున్న ముద్దుగుమ్మ.. బ్యాక్ టు బ్యాక్ ఆఫర్స్



తెలుగు సినిమా పరిశ్రమలో హీరోయిన్ల కెరీర్ గ్రాఫ్ ఎప్పుడు ఎలా మారుతుందో చెప్పడం కష్టం. ఒక హిట్ పడితే అవకాశాలు క్యూ కడతాయి, కానీ ఒకే నిర్మాణ సంస్థలో వరుసగా ఛాన్సులు రావడం మాత్రం అరుదుగా జరుగుతుంటుంది. ప్రస్తుతం టాలీవుడ్‌లో ఈ అరుదైన ఫీట్‌ను సాధిస్తోంది ఈ చిన్నది. ప్రస్తుతం ఇండస్ట్రీలో కొత్త హీరోయిన్స్ హవా కనిపిస్తుంది. సినిమా సినిమాకు కొత్త అందాలు ప్రేక్షకులను పలకరిస్తున్నాయ. అంతే కాదు ఒకప్పుడు 10 సినిమా చేస్తే కానీ రాని క్రేజ్ ఇప్పుడు ఒకే ఒక సినిమాతో దక్కించుకుంటున్నారు. ఇలా ఓవర్ నైట్ స్టార్స్ గా మారిన హీరోయిన్స్ చాలా మంది ఉన్నారు. ఇప్పుడున్న హీరోయిన్స్ 10 సినిమాలు చేస్తే గొప్ప అన్నట్టుగా మారిపోయింది. కొంతమంది ఒకటి రెండు సినిమాలతోనే పాపులర్ అయ్యి ఆతర్వాత అవకాశాలు అందుకోలేక దూరం అవుతున్నారు. కానీ ఇప్పుడు ఓకే హీరోయిన్ మాత్రం వరుసగా సినిమాలు చేస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. తెలుగుతో పాటు తమిళ్ లోనూ సినిమాలు చేసి ప్రేక్షకులను ఆకట్టుకుంది. తెలుగులో 9 సినిమాలు చేసింది. వాటిలో 5 సినిమాలు సూపర్ హిట్ అయ్యింది. ఇంతకూ ఆ అమ్మడు ఎవరో తెలుసా.? రీసెంట్ గా బ్యాక్ టు బ్యాక్ హిట్స్ అందుకొని తెలుగులో క్రేజీ హీరోయిన్ గా మారిపోయింది. ఆమె ఎవరో కాదు. ప్రస్తుతం టాలీవుడ్‌లో ఎక్కువగా వినిపిస్తున్న పేరు మీనాక్షి చౌదరి. ప్రస్తుతం వరుస సినిమాలతో దూసుకుపోతుంది. 2019లో ఓ హిందీ సినిమాలో చిన్న పాత్ర ద్వారా సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చింది మీనాక్షి. ఆ తర్వాత 2021లో టాలీవుడ్ లోకి హీరోయిన్‌గా పరిచయం అయ్యింది. ఇచటవాహనములు నిలుపరాదు అనే సినిమాతో హీరోయిన్ గా తెలుగులోకి ఎంట్రీ ఇచ్చింది. తొలి సినిమాతోనే తన నటనతో అందరి దృష్టి ఆకర్షించింది ఈ వయ్యారి.. ఆతర్వాత రవితేజ సినిమా ఖిలాడీ సినిమాలో నటించింది. ఈ సినిమాలో గ్లామరస్ గా కనిపించి అందరూ షాక్ అయ్యేలా చేసింది. దాంతో ఈ ముద్దుగుమ్మకు ఆఫర్స్ క్యూ కట్టాయి. ఆతర్వాత తెలుగులో వరుస ఆఫర్స్ తో ఫుల్ బిజీగా మారిపోయింది. కెరీర్ స్టార్టింగ్ డేస్‌లోనే రవితేజ, మహేష్ బాబు లాంటి స్టార్ హీరోల సినిమాల్లో నటించే అవకాశం అందుకున్న ఈ బ్యూటీకి లక్కీ భాస్కర్ సినిమాలో లక్ కలిసొచ్చింది. దుల్కర్ సల్మాన్ నటించిన ఆ సినిమా మంచి విజయాన్ని అందుకుంది. దాంతో మీనాక్షికి బ్యాక్ టు బ్యాక్ ఆఫర్స్ క్యూ కట్టాయి. ఆ తర్వాత వరుణ్ తేజ్ నటించిన మట్కా, విశ్వక్ సేన్ నటించిన మెకానిక్ రాకీ సినిమాలు డిజాస్టర్స్ గా నిలిచాయి. కానీ ఈ అమ్మడి క్రేజ్ మాత్రం ఎక్కడా తగ్గలేదు.ఆతర్వాత సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో భారీ హిట్ అందుకుంది. ఈ మూవీ ఎంత పెద్ద విజయం సాధించిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. రీసెంట్ గా అనగనగ ఓ రాజు సినిమాతో మరో హిట్ తన ఖాతాలో వేసుకుంది ఈ కుర్రభామ. మొత్తం తెలుగులో 9 సినిమాలు చేసిన ఈ చిన్నది 5 హిట్స్ అందుకుంది. ఇక ఇప్పుడు ఈ ముద్దుగుమ్మ చేతిలో కొన్ని క్రేజీ ప్రాజెక్ట్స్ ఉన్నాయి.

# అభిరథ్ సెంచరీ.. హైదరాబాద్ ఈ-ఛాంపియన్స్ పాంచ్ పటాకా



టీజీ20 లీగ్ 2026లో హైదరాబాద్ ఈ-ఛాంపియన్స్ అప్రతిహత విజయాలతో దూసుకుపోతోంది. బుధవారం వరంగల్ వారియర్స్‌ను హైదరాబాద్ 6 వికెట్ల తేడాతో ఓడించింది. దీంతో ఈ-ఛాంపియన్స్ వరుసగా ఐదో విజయాన్ని ఖాతాలో వేసుకుని ప్లే ఆఫ్స్ బెర్తును దాదాపు ఖరారు చేసుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన వరంగల్ వారియర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 173 పరుగులు చేసింది. ఈ టార్గెట్‌ని హైదరాబాద్ 15.3 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. కెప్టెన్, ఓపెనర్ అభిరథ్ రెడ్డి (101బి; 43 బంతుల్లో 7 ఫోర్లు, 9 సిక్సలు) మరోసారి అదరగొట్టి శతకం బాదాడు. మిడిల్ ఆర్డర్ బ్యాటర్ గడుగు గణేశ్ (50; 31 బంతుల్లో 1 ఫోర్, 5 సిక్సలు) కూడా సూపర్ ఫామ్‌ను కొనసాగిస్తూ అర్ధ శతకం బాదాడు. ఇప్పటివరకు ఐదు మ్యాచ్‌లు ఆడిన వరంగల్‌కు ఇది నాలుగో ఓటమి. సిక్సర్‌తో పరుగుల ఖాతా తెరిచిన అభిరథ్ దూకుడు కొనసాగించగా.. ఆ వెంటనే మరో రెండు సిక్సర్లు బాదాడు. ఈ క్రమంలో హైదరాబాద్ స్వల్ప వ్యవధిలో వికెట్లు కోల్పోయింది. సాయివికాస్ (10).. క్రాంతి బౌలింగ్‌లో అమన్‌రావు చేతికి చిక్కి పెవిలియన్‌కు చేరాడు. వన్‌డౌన్‌లో వచ్చిన అజయ్‌దేవ్ (0) రనౌటయ్యాడు. సల్మాన్ ఖాన్ బౌలింగ్‌లో అన్విత్ రెడ్డి (4) ఔటయ్యాడు. దీంతో ఈ-ఛాంపియన్స్ 32 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయింది. ఈ దశలో క్రీజులోకి వచ్చిన గడుగు గణేశ్‌తో కలిసి అభిరథ్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. వీరు నిలకడగా బౌండరీలు బాదడంతో హైదరాబాద్ లక్ష్యం దిశగా సాగింది. శౌనక్ బౌలింగ్‌లో హైదరాబాద్ కెప్టెన్ ఒక సిక్స్, రెండు ఫోర్లు బాదాడు. అభిషేక్ వేసిన 11 ఓవర్‌లో గణేశ్ వరుసగా రెండు సిక్సర్లు రాబట్టాడు. శౌనక్ వేసిన 12 ఓవర్‌లో సిక్స్ కొట్టి అర్ధ శతకం పూర్తి చేసుకున్న గణేశ్ తర్వాత బంతికే ఔటయ్యాడు. అదే ఓవర్‌లో అభిరథ్ హాఫ్ సెంచరీ (28 బంతుల్లో) పూర్తి చేసుకున్నాడు. అనంతరం అభిరథ్ దూకుడు పెంచాడు. శౌనక్ వేసిన 14 ఓవర్‌లో వరుసగా 6, 4, 6.. క్రాంతి బౌలింగ్‌లో 4, 4, 6 బాదేసి 90ల్లోకి వచ్చేశాడు. సల్మాన్ వేసిన 16 ఓవర్‌లో 4, 6 కొట్టి సెంచరీ పూర్తి చేసుకోవడంతోపాటు మ్యాచ్‌ను ముగించాడు. తొలుత బ్యాటింగ్ చేసిన వరంగల్ వారియర్స్ బ్యాటర్లలో కెప్టెన్ అమన్‌రావు (45; 20 బంతుల్లో) టాప్ స్కోరర్. రిషికేత్ సిసోదియా (38; 32 బంతుల్లో), శౌనక్ కులకర్ణి (24), హర్షిత్ చౌదరి (22), ధీరజ్ (18) పరుగులు చేశారు. హైదరాబాద్ బౌలర్లలో అజయ్‌దేవ్ గౌడ్ (3/27) మరోసారి చక్కటి ప్రదర్శన చేశాడు. దేవ్ మెహతా, అఖిల్ రాథోడ్, షణ్ముఖ అశ్విన్, ప్రణవ్ వర్మ, అభిరథ్ రెడ్డి ఒక్కో వికెట్ పడగొట్టారు.

# ఓటమితో పునరాగమనం..

## ప్రెస్ కాన్ఫరెన్స్‌కు రాని సెరెనాపై ట్రోలింగ్



టెన్నిస్ దిగ్గజం సెరెనా విలియమ్స్ దాదాపు నాలుగేళ్ల తర్వాత గ్రాండ్‌స్లామ్ బరిలోకి దిగింది. వైల్డ్ కార్డ్ ఎంట్రీతో వింబుల్డన్‌లో పునరాగమనం చేసిన ఈ అమెరికా స్టార్‌కు ఆదిలోనే చుక్కెదురైంది. తొలి రౌండ్‌లో 20 ఏళ్ల మాయా జాయింట్ చేతిలో సెరెనా ఓడిపోయింది. 23 సార్లు గ్రాండ్‌స్లామ్ విజేత అయిన సెరెనా పునరాగమనంలో మెరుగైన ఆటతీరునే ప్రదర్శించింది. అయితే, ఆస్ట్రేలియాకు చెందిన మాయ 6-3, 6-7(6), 6-3 తేడాతో సెరెనాను ఓడించింది. తొలి రౌండ్‌ను అలవోకగానే గెలుచుకున్న మాయాకు.. రెండో రౌండ్‌లో సీనియర్ సెరెనా నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదురైంది. ఇరువురూ చెరొకటి గెలిచి సమంగా నిలిచారు. దీంతో నిర్ణయాత్మక మూడో రౌండ్ మరింత ఉత్కంఠగా సాగుతుందని అభిమానులు భావించారు. కానీ, మాయా దూకుడు ముందు సెరెనా నిలవలేకపోయింది. ఈ మ్యాచ్‌ను సెరెనా కుమార్తె ఒలంపియా ప్రత్యక్షంగా వీక్షించింది.

**ప్రకటన విడుదల..**

సాధారణంగా మ్యాచ్ ముగిసిన తర్వాత ప్లేయర్లు ప్రెస్ కాన్ఫరెన్స్‌ల్లో మాట్లాడుతూ ఉంటారు. కానీ, సెరెనా మాత్రం అలాంటిదేమీ చేయకుండా వెళ్లిపోవడం అభిమానులను తీవ్ర నిరాశకు గురి చేసింది. దీంతో ఆమెపై ట్రోలింగ్ మొదలైంది. వేల డాలర్లు ఖర్చు పెట్టి, వైల్డ్ కార్డ్ ఎంట్రీ దక్కించుకుని.. ఇప్పుడు కనీసం ప్రెస్ కాన్ఫరెన్స్‌లోనూ మాట్లాడకపోవడం సరికాదంటూ కామెంట్లు వచ్చాయి. ఈ క్రమంలో సెరెనా పేరుతో.. వింబుల్డన్ నిర్వాహకులు ఓ ప్రకటన విడుదల చేశారు. "వింబుల్డన్‌లోకి తిరిగిరావడం చాలా ఆనందంగా ఉంది.

# హార్దిక్ పాండ్యాకు నో చెప్పిన 2 జట్లు..

## రేసులోకి దూసుకొచ్చిన 7 జట్లు.. అసలు ట్విస్ట్ ఏంటంటే?



హార్దిక్ పాండ్యా ముంబై ఇండియన్స్ నుంచి విడిపోవడం దాదాపు ఖాయమైన నేపథ్యంలో, ఆయన తదుపరి ప్రయాణం ఎటువైపు సాగుతుందనేది ఉత్కంఠ రేపుతోంది. ధోనీ నీడలో చెన్నై సూపర్ కింగ్స్ పగ్గాలు చేపడతారా? లేక కోల్‌కతా, రాజస్థాన్ జట్లలో చేరి సరికొత్త అధ్యాయాన్ని ప్రారంభిస్తారా అనేది మరికొద్ది రోజుల్లో తేలనుంది. ఐపీఎల్ క్రికెట్ ప్రపంచంలో మరో పెను సంచలనం నమోదు కాబోతోందా? టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా ముంబై ఇండియన్స్ జట్టును వీడనున్నారా? ప్రస్తుతం క్రీడా వర్గాల్లో ఇదే హాట్ టాపిక్. తాజా సమాచారం ప్రకారం, ఐపీఎల్ వచ్చే సీజన్ వేలానికి ముందే హార్దిక్ ముంబైకి దూరం కావడం దాదాపు ఖాయంగా కనిపిస్తోంది. ఇప్పటికే పలు ఫ్రాంచైజీలు ఆయన కోసం పోటీ పడుతున్నాయి.

**ముంబైతో ముగిసిన బంధం? రేసులో 7 జట్లు!**

ఐపీఎల్ గత సీజన్ ముగిసినప్పటి నుంచే హార్దిక్ పాండ్యా ముంబై ఇండియన్స్ ఫ్రాంచైజీని వీడుతున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. అయితే ఈ విషయంపై ముంబై యాజమాన్యం ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. కానీ, లోపల జరుగుతున్న పరిణామాలు మాత్రం హార్దిక్ జట్టు మారడం ఖాయమని స్పష్టం చేస్తున్నాయి. ఒక నివేదిక ప్రకారం, ఐపీఎల్‌లోని మొత్తం 10 ఫ్రాంచైజీలలో దాదాపు 7 జట్లు హార్దిక్‌ను తమ జట్టులోకి తీసుకోవడానికి విపరీతమైన ఆసక్తిని చూపిస్తున్నాయి. ఒక స్టార్ ఆల్‌రౌండర్‌గా, మ్యాచ్ విన్నర్‌గా హార్దిక్‌కు ఉన్న క్రేజ్ అలాంటిది. ముఖ్యంగా జట్టును ముందుండి నడిపించగల కెప్టెన్సీ నైపుణ్యాలు ఆయనకు అదనపు బలంగా మారాయి. దీంతో ఫ్రాంచైజీలన్నీ ఆయనను దక్కించుకోవడానికి వ్యూహాలు ప్రతివ్యూహాలు రచిస్తున్నాయి.

**ఆ రెండు జట్లు తప్పుకున్నాయి.. కారణం ఏంటి?**

హార్దిక్ పాండ్యాను కొనుగోలు చేసే రేసు నుంచి రెండు ప్రధాన జట్లు పూర్తిగా తప్పుకున్నట్లు తెలుస్తోంది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, సన్‌రైజర్స్ హైదరాబాద్ ఫ్రాంచైజీలు హార్దిక్‌ను తీసుకోవడానికి ఆసక్తి చూపించడం లేదు. మొదట్లో బెంగళూరు జట్టు ఆయన కోసం ప్రయత్నిస్తుందని వార్తలు వచ్చినప్పటికీ, తాజా నివేదికల ప్రకారం వారు ఈ రేసు నుంచి తప్పుకున్నారు. హైదరాబాద్ సైతం తమ ప్రస్తుత జట్టు సమతుల్యతను దెబ్బతీసే ఉద్దేశం లేకపోవడంతో హార్దిక్ వైపు చూడటం లేదని సమాచారం.

**చెన్నై సూపర్ కింగ్స్ వైపు హార్దిక్ అడుగులు? ధోనీయే కారణమా?**

ఈ మొత్తం ఎపిసోడ్‌లో అత్యంత ఆసక్తికరమైన అంశం చెన్నై సూపర్ కింగ్స్ (సిఎస్‌కే) ఎంట్రీ. గత వారం వరకు చెన్నైకి హార్దిక్‌ను తీసుకునే ఉద్దేశం లేదని వార్తలు వచ్చాయి. కానీ, ఇప్పుడు సీన్ పూర్తిగా మారిపోయింది. మహేంద్ర సింగ్ ధోనీతో హార్దిక్ పాండ్యాకు ఉన్న అత్యంత సన్నిహిత సంబంధాలే ఇందుకు ప్రధాన కారణమని టాక్. ధోనీ సూచనల మేరకే చెన్నై ఫ్రాంచైజీ హార్దిక్ కోసం గట్టిగా ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుత కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ సారథ్యంలో చెన్నై గత రెండు సీజన్లలో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయింది. ప్లేఆఫ్స్ చేరడంలో కూడా విఫలమైంది. ఈ నేపథ్యంలో జట్టుకు భవిష్యత్తులో ఒక బలమైన, అనుభవజ్ఞుడైన నాయకుడు కావాలని సీఎస్‌కే యాజమాన్యం భావిస్తోంది. గుజరాత్ టైటాన్స్ జట్టుకు ఐపీఎల్ ట్రోఫీ అందించిన అనుభవం ఉన్న హార్దిక్ అయితే చెన్నైకి సరైన వారసుడు అవుతాడని భావిస్తున్నారు.

**కోల్‌కతా, రాజస్థాన్ జట్ల భారీ స్కెచ్..!**

హార్దిక్ పాండ్యాను ట్రేడ్ చేయడానికి చెన్నై కంటే ఎక్కువగా కోల్‌కతా నైట్ రైడర్స్, రాజస్థాన్ రాయల్స్ జట్లు అమితమైన ఆసక్తిని కనబరుస్తున్నాయి. ఈ రెండు ఫ్రాంచైజీలు హార్దిక్‌ను కేవలం ఒక ఆటగాడిగా కాకుండా, తమ తదుపరి కెప్టెన్‌గా చూస్తున్నాయి. రాజస్థాన్ రాయల్స్ జట్టుకు గత సీజన్లలో రియాన్ పరాగ్ నాయకత్వం వహించినప్పటికీ, హార్దిక్ లాంటి సీనియర్ దొరికితే కెప్టెన్సీ బాధ్యతలు ఆయనకే అప్పగించాలని రాజస్థాన్ యాజమాన్యం యోచిస్తోంది. అటు కోల్‌కతా సైతం హార్దిక్ కోసం భారీ ఆఫర్‌తో సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. హార్దిక్ పాండ్యా ముంబై ఇండియన్స్ నుంచి విడిపోవడం దాదాపు ఖాయమైన నేపథ్యంలో, ఆయన తదుపరి ప్రయాణం ఎటువైపు సాగుతుందనేది ఉత్కంఠ రేపుతోంది. ధోనీ నీడలో చెన్నై సూపర్ కింగ్స్ పగ్గాలు చేపడతారా? లేక కోల్‌కతా, రాజస్థాన్ జట్లలో చేరి సరికొత్త అధ్యాయాన్ని ప్రారంభిస్తారా అనేది మరికొద్ది రోజుల్లో తేలనుంది. ఏదేమైనా వచ్చే ఐపీఎల్ సీజన్ కంటే ముందే ఈ ట్రేడింగ్ రూపంలో క్రికెట్ అభిమానులకు భారీ వినోదం లభించడం ఖాయం.


విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...





VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com